ప్రజాశక్తి

సోమవారం 1 మే 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



నృత్యాలతో ఆకట్టుకున్న కళాకారులు

ఉత్సాహంగా మేడే సంబరాలు

వార్త మెయిన్, టాబ్లాయిడ్ 8లో..

బిజెపితో దేశానికి నష్టం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు
- అనకాపల్లిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార భేరి సభ

ప్రజాశక్తి - అనకాపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలతో దేశ ప్రగతికి తీవ్ర విఘాతం ఏర్పడుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన 15 రోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రచార భేరి కార్యక్రమం ముగింపు సభ స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక, కర్షక నిలయంలో జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వై.వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల అన్ని ధరలూ పెరిగాయన్నారు. 32 మంది ఆత్మబలిదానాలతో ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తే రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. రిజర్వేషన్లు అమలు కాకపోవడంతో పాటు లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులు రోడ్డున మిగతా 2లో..



మాట్లాడుతున్న వై.వెంకటేశ్వరరావు, వేదికపై బాలేపల్లి వెంకటరమణ

ఇలాగేనా

రైతుకు సాయం ?

- పిఎం కిసాన్‌కు ఇకెవైసి తప్పనిసరంటూ కేంద్రం నిబంధన
- నమోదు చేసుకోలేని 41 వేల మంది రైతులు
- 14వ విడత లబ్ధికి దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

రైతులకిచ్చే ఆర్థిక సాయంపై కోత పెట్టే చర్యలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 14వ విడత సాయం బ్యాంకు ఖాతాల్లో జమచేయడానికి రైతులందరూ ఇకెవైసి నమోదుచేసుకోవాలని మెలికపెట్టింది. ఇకెవైసి నమోదు గడువు ఏప్రిల్ 30 నాటితో ముగిసింది. దీంతో ఇకెవైసి నమోదుచేసుకోలేని 41 వేల మంది రైతులు సాయం కోల్పోనున్నారు. అనకాపల్లి జిల్లాలో రెండు లక్షలా 13 వేల మంది రైతులున్నారు. వీరిలో లక్షా 72 వేల మంది (81 శాతం) ఇకెవైసి చేసుకున్నారు. ఇంకా 41 వేల మంది ఇకెవైసి మిగతా 2లో..

కిడ్నీ రాకెట్ కేసులో ఆరుగురు అరెస్టు

వార్త మెయిన్‌లో..

ఉక్కు పోరాట పంథాకు పదును పెట్టాలి

వార్త 2లో..

మొదటి పేజీ తరువాయి..

బిజెపితో దేశానికి నష్టం

పడే ప్రమాదం ఉందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందని, కార్మిక చట్టాలను రద్దు చేసి హక్కులను కాలరాస్తోందని తెలిపారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు రూ.50 వేల కోట్లు కోత విధించడం ద్వారా ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ తొమ్మిది సంవత్సరాలైనా నెరవేరలేదన్నారు. పెద్ద నోట్ల రద్దుతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు. బిజెపి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ పార్టీ నేతలు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని తెలిపారు. మోడీని గద్దె దించితేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన బిజెపి విధానాలకు మద్దతు తెలుపుతున్నాయన్నారు. ఎపికి తీవ్ర ద్రోహం చేసిన మోడీ సర్కారును ఆ పార్టీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. బిజెపి మతోన్మాద విధానాలపై పోరాటం చేసే వారితో వామపక్షాలు కలిసి ఉద్యమిస్తాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, మాకిరెడ్డి రామునాయుడు, వైఎన్.భద్రం, తాకాశి వెంకటేశ్వరరావు, వి.రాజు, సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాథ్ బాబు పాల్గొన్నారు.

ఇలాగేనా రైతుకు సాయం ?

నమోదుచేసుకోవాల్సివుంది. ఈ ప్రక్రియ పూర్తికాకుండానే గడువు ముగియడంతో వీరంతా సాయానికి దూరంకానున్నారు. ఏడాదిలో మూడు దఫాలుగా రెండు వేల రూపాయల చొప్పున ఆరు వేల రూపాయలు రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమచేసేది. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకున్న రైతుల ఖాతాల్లో ఇప్పటి వరకూ ఆర్థిక సాయం జమచేసుకుంటూ వచ్చింది. ఈ ఏడాది మేలో జమచేయాల్సిన తొలి దఫా సాయానికి ఇకెవైసి తప్పనిసరంటూ పేచీ పెట్టింది. సాంకేతిక కారణాల వల్ల ఇకెవైసి నమోదుచేసుకోలేని 41 వేల మంది రైతులకు ప్రభుత్వం పెట్టిన కొత్త నిబంధనలు గుదిబండగా మారాయి. భూమి కల్గిన రైతులు సొంతూరులో లేకపోవడం, ఆధార్‌తో అనుసంధానం చేసుకున్న ఫోన్ నెంబరు మారడం వల్ల ఒటిపి రాకపోవడం, లబ్ధి పొందిన రైతు చనిపోవడం, వంటి పలు కారణాలతో రైతులు ఇకెవైసి నమోదుచేసుకోలేకపోయారు. ఇలా నమోదుచేసుకోలేని రైతులు మండలానికి వెయ్యి నుంచి పదిహేను వందల మంది రైతుల వరకు ఉంటారని వ్యవసాయశాఖాధికారులు అంచనా వేస్తున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకున్న రైతులకు గతంలో ఆర్థిక సాయం చేసినట్లే, 14వ విడత సాయం కూడా చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు వద్ద ప్రస్తావించగా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద విడుదల చేసే సాయానికి ప్రతీ రైతు ఇకెవైసి చేసుకోవాల్సివుందన్నారు. ఈ గడువు ఏప్రిల్ 30తో ముగిసేనాటికి 81 శాతం మంది రైతులు ఇకెవైసి చేసుకోగలిగారని తెలిపారు. 14వ విడత సాయం ఇకెవైసి చేసుకున్న రైతులకు అందిస్తామని చెప్పారు. ఇకెవైసి చేసుకోలేని రైతులకు ఆర్థిక సాయం భారత ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడివుంటుందన్నారు.



మాట్లాడుతున్న హీరో అల్లరి నరేష్

నగరంలో ఉగ్రం చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉగ్రం చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ ఉగ్రం చిత్రం తన సినీ కెరియర్‌లో ఓ హైలెట్ చిత్రంగా నిలిచిపోతుందని అన్నారు. ఈ చిత్రం సూపర్ హిట్ అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది తనకు 60వ చిత్రమని చెప్పారు. మిస్సింగ్ కేసుల గురించి ఈ సినిమాలో చూపించామన్నారు. లాక్‌డౌన్ సమయంలో 1.5 లక్షల మంది కనిపించకుండా పోయారనే విషయం తెలిసిందేనని, వారంతా ఏమయ్యారో ఇప్పటికీ తెలియదని చెబుతూ రూపొందించిందే ఉగ్రం చిత్రమని చెప్పారు. ఈ నెల 5న చిత్రం విడుదలవుతుందని తెలిపారు. చిత్ర హీరోయిన్ మీర్నా మీనన్ తెలుగులో ఇది తనకి రెండో చిత్రమని అన్నారు. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించగా, కెమెరామెన్‌గా సిద్ అద్భుతంగా తెరకెక్కించారని చెప్పారు.

ఉక్కు పోరాట పంథాకు పదును పెట్టాలి



అభివాదం చేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పోరాట కమిటీ నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని డిమాండ్ చేస్తూ కార్మికులు చేస్తున్న పోరాటం 808వ రోజుకు చేరుకోవడం చిన్న విషయమేమీ కాదని, ఒక కర్మాగారాన్ని రక్షించుకోవడం కోసం ఇంత కాలంగా పోరాటం దేశంలో ఎక్కడా సాగలేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ, మొండి వైఖరి కారణంగా పోరాట పంథాకు మరింత పదును పెట్టాల్సి ఉందన్నారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆదివారం ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు, కార్మిక సంఘాల నాయకులతో సిపిఐ కార్యాలయంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా ఉండడానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి చేపట్టాల్సిన భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలను యూనియన్ నేతలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ స్పందిస్తే తప్ప ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగదన్నారు. కేంద్రం మొండిగా వ్యవహరిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. పార్లమెంట్ సభ్యులు అందరూ ప్రధానిని కలవాలని సూచించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కెఎస్ఎన్.రావు, ఎన్.రామచంద్రరావు, యు.రామస్వామి, వై.మస్తానప్పు, దొమ్మేటి అప్పారావు, జె.రామకృష్ణ, శ్రీనివాసరాజు, ఇందల శివ, డి.రాజా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలో కానరాని అభివృద్ధి

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఒక రావణాసురుడని, అతని హయాంలో అభివృద్ధి కుంటుపడిందని టిడిపి మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితమే భోగాపురం ఎయిర్‌పోర్ట్, అదానీ డేటా సెంటర్‌లకు చంద్రబాబు శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు ఎన్నికలు వస్తు న్నాయి కాబట్టి వాటికే మళ్లీ సిఎం జగన్ భూమి పూజ చేస్తున్నారని తెలిపారు. ఇలా చేయడం తగదన్నారు. హెచ్ఎస్‌బిసి సహ పలు కంపెనీలు వైజాగ్ వదిలి వెళ్లిపోయిన నేపథ్యంలో కంపెనీలతో సిఎం జగన్ ఎప్పుడైనా మాట్లాడారా ? అని ప్రశ్నించారు. న్యాయస్థానాలు అంటే వైసిపి ప్రభుత్వానికి గౌరవం లేదన్నారు. విశాఖ మెట్రో రైలు అటకెక్కిందని ఎద్దేవా చేశారు. విశాఖలో గతంలో చాలా విమాన సర్వీసులు ఉండేవని, జగన్ పుణ్యమా అని ఇప్పుడు ఒకటి రెండు సర్వీసులు మాత్రమే మిగిలాయని అన్నారు. రొయ్యలు ఎగుమతి చేసుకోవడానికి రైతులు సిద్ధమైతే విమానం లేకుండా చేశారన్నారు.

గతంలో ఐటి హిల్స్‌లో మంచి మౌలిక సదుపాయాలు కల్పిస్తే వాటిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. అవినాష్ రెడ్డి అరెస్ట్‌పై ప్రజల దృష్టి మరల్చేందుకే సిఎం విశాఖ పర్యటన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల అభివృద్ధికి స్టార్టప్ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల వేదికగా వంద అంకుర సంస్థల స్థాపనకు అడుగులు పడ్డాయి. సర్వజ్ఞ ఫౌండేషన్, నెంబర్ వన్ ఒటిటి, స్టార్ట్ అప్ ప్రీమియర్ లీగ్, దర్బార్ ఎంటర్ టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా స్టార్టప్ ప్రీమియర్ లీగ్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా హాజరయిన సిబిఐ మాజీ జెడి వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించి, తద్వారా అంకుర పరిశ్రమలు నిర్మాణానికి సర్వజ్ఞ ఫౌండేషన్ అన్ని విధాలా కృషి చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యా సంస్థ ఛైర్మన్ జి.సత్యనారాయణ, నెంబర్ వన్ ఒటిటి మీడియా సంస్థ సిఎండి మంచాల సాయి సుధాకర్ నాయుడు, స్టార్టప్ ప్రీమియర్ లీగ్, సర్వజ్ఞ సంస్థల వ్యవస్థాపకులు, సిఇఒ డాక్టర్ అనిల్ కుమార్ పసినిబిల్లి (డోలోనాథ్), మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, పలువురు విద్యావేత్తలు, పారిశ్రామికాధిపతులు పాల్గొన్నారు.

'వాకపల్లి' అత్యాచార నిందితులపై చర్యలేవీ ?

ప్రజాశక్తి - కలెక్టరేట్

కోర్టు తీర్పు వెలువడినప్పటికీ వాకపల్లి అత్యాచార నిందితులకు శిక్షలు పడకపోవడం శోచనీయమని పలువురు వక్తలు అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో పలువురు వక్తలు పాల్గొన్నారు. దోషులకు శిక్ష పడే వరకు పోరాటం కొనసాగించాలని వారు అన్నారు.

దర్యాప్తు అధికారులు సరిగా దర్యాప్తు చేయలేని కారణంగానే దోషులను నిర్ధారించడం సాధ్యం కాలేదని కోర్టు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. దర్యాప్తు అధికారులకు శిక్షలు పడే వరకూ, బాధిత మహిళలకు తగిన పరిహారం అందే వరకూ పోరాటం కొనసాగించాలని కోరారు. పిఒడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి సంఘం తరుపున చర్చ కోసం ఓ పత్రాన్ని ప్రవేశపెట్టారు.

చర్చలో న్యాయవాదులు పల్లేటి అప్పారావు, కె.పద్మ, సీతాలక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు డి.లలిత తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, నూకరాజు, కె.నిర్మల, శ్రీనివాస్, ఎయు విశ్రాంత రిజిస్ట్రార్ డి.నటరాజ్, భీమ్‌సేన్ వార్ అధ్యక్షులు చిన్నారావు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కేర్ ఆసుపత్రి సిబ్బంది

తీరంలో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్వచ్ఛ కేర్ నినాదంతో కేర్ హాస్పిటల్స్ వారు సామాజిక బాధ్యతగా ఆదివారం ఆర్‌కె బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా కాళీ మాత గుడి నుంచి ర్యాలీ చేపట్టారు. మన నగరం – మన బాధ్యత అంటూ పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. ర్యాలీ అనంతరం బీచ్ వెంబడి రెండు కిలోమీటర్ల మేర ఉన్న వ్యర్థాలను తొలగించారు. 50 మందికిపైగా కేర్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి కేర్ హాస్పిటల్స్ పరిపాలనాధికారి వద్దిపర్తి శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమని, కరోనా అనంతరం ప్రతి ఒక్కరిలో అవగాహన పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఫరూఖీ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐహెచ్.ఫరూఖీ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అక్కయ్యపాలెంలోని ఫరూఖీ కార్యాలయంలో గురుస్థానం ది ప్లే స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఖాన్ మాట్లాడుతూ ఫరూఖీ మైనారిటీల అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. యువతను అన్ని విధాలుగా ప్రోత్సహించారని తెలిపారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో డిఆర్ఎం తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి ఆదివారం ఉదయం కోచ్ కేర్ సెంటర్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను తనిఖీ చేశారు. నిర్వహణ కార్యకలాపాలు, అవలంబించిన పరిశుభ్రత చర్యలను పరిశీలించారు.

కిడ్నీ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం కార్పొరేటర్ గంగారావు



కిడ్నీ బాధితుడిని పరామర్శిస్తున్న గంగారావు తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : కిడ్నీ బాధితుడు జి.వినయ్‌కుమార్‌కు మెరుగైన వైద్యం చేయించాలని, కిడ్నీ దొంగల ముఠాపై కఠిన చర్యలు తీసుకోవాలని జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వాంబేకాలనీలో కిడ్నీ బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి గుర్తింపు, అనుమతులు లేకుండా కొంత మంది ముఠాగా ఏర్పడి పేదలను లక్ష్యం చేసుకునికొన్ని ఆసుపత్రులను ఏర్పాటుచేసి అవయవాలను అపహరిస్తున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కిడ్నీ బాధితుడు తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడని, వెంటనే అతనికి మెరుగైన వైద్యం చేయించాలని కోరారు. వినయ్ కుమార్ మంచాన పడటంతో అతని కుటుంబానికి పూట గడవటం కష్టంగా మారిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కెజిహెచ్ సూపరింటెండెంట్‌తో గంగారావు ఫోన్‌లో మాట్లాడి వినయ్‌కుమార్‌ను ఆసుపత్రిలో చేర్చుకొని ఆరోగ్యం కుదుటపడే విధంగా అత్యాధునిక వైద్యం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జోన్ నాయకులు పి.రాజుకుమార్, సిహెచ్.శేషుబాబు, జి.కిరణ్, రాము, సిపిఎం నాయకులు డి.అప్పలరాజు, గోవింద్ పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 5, 7 వార్డుల పరిధి మధురవాడ, స్వతంత్రనగర్‌లోని శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, టిడిపి జిల్లా నాయకులు పిల్లా వెంకట్రావు, టిడిపి పార్లమెంటరీ యువత కార్యదర్శి గరే గురునాథ్ (కెవిఆర్), జనసేన నాయకులు నక్కా శ్రీధర్, శ్రీకనకదుర్గ క్యాటరింగ్, ఈవెంట్స్ అధినేత కోర్రాయి సురేష్ పాల్గొని అన్నసంతర్పణను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో యువత అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు.

వాకర్స్ క్లబ్ ఏర్పాటు

ప్రజాశక్తి- భీమునిపట్నం : పలువురు విశ్రాంత ఉద్యోగుల ఆధ్వర్యంలో స్థానికంగా "జె సి వాకర్స్ భీమిలి" పేరిట వాకర్స్ క్లబ్‌ను ఏర్పాటుచేశారు. ఈ మేరకు జమ్మి చెరువు పార్కు వద్ద ఆదివారం సమావేశం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది ఎస్.జనార్దనరావు, విశ్రాంత ఉద్యోగులు దత్తి ఈశ్వరరావు, శంకర్‌కుమార్, లక్ష్మీనారాయణ, ఎం.శ్యామ్‌సుందర్, ఎన్.అప్పలనాయుడు, కెవిఎన్.కృష్ణారావు ఆధ్వర్యంలో క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు ఆరోగ్యమే మహాభాగ్యం అంశంపై మాట్లాడారు. అనంతరం న్యాయవాది జనార్ధన రావు, శ్యామ్‌సుందర్ దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సునీల్, స్థానికులు సంకురు భుక్త జోగారావు, ఎ.హేమంత్‌శేఖర్ పాల్గొన్నారు.

నారాయణకు నివాళి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం కృష్ణంరాజుపేటకు చెందిన కీర్తిశేషులు గాడు నారాయణకు ఆదివారం గ్రామంలో జరిగిన సంస్మరణ సభలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. నివాళులర్పించిన వారిలో జెడ్పిటీసీ సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు, వైస్ ఎంపిపి బోని బంగారునాయుడు, పలువురు సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు ఉన్నారు. గాడు నారాయణ కుమారుడైన వైసిపి మండల పార్టీ అధ్యక్షులు గాడు శ్రీను, అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు.

సెల్ఫీలు కాదు.. ఓపెన్ ఛాలెంజ్‌కు సిద్ధమా?

టిడిపి నేతలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి సవాల్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : సెల్ఫీ ఛాలెంజ్‌లు కాదు, తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం కావాలని టిడిపి నేతలకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సవాల్ విసిరారు. భీమిలి మండలం టి.నగరపాలెంలో కమ్యూనిటీ హాల్ నుంచి ఎల్లారమ్మ గుడి వరకు గోస్తనిపై వంతెన నిర్మాణానికి చిప్పాడ దివీస్ రూ.2.98 కోట్లు ఆర్థిక సాయం చేయడంతో ఆ పనులకు ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, 1520 మంది ఓటర్లున్న టి.నగరపాలెం పంచాయతీలోనే 4ఏళ్ల కాలంలో ప్రభుత్వం రూ.11 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. దివీస్ ఆధ్వర్యాన ఇదే పంచాయతీలో ఇప్పటికే రూ. 3.38 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. తగరపువలసలో ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఏర్పాటుచేయడం తథ్యమని నొక్కి చెప్పారు.

సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి మాట్లాడుతూ, 2022 ఫిబ్రవరిలో ఇదే వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ పరంగా సాంకేతిక పరమైన ఆమోదం లభించడంలో ఆలస్యమైనందున వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. దీంతో స్థానికుల నుంచి విమర్శలు ఎదురయ్యాయన్నారు. 9నెలల వ్యవధిలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ సభలో ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు, జడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఎంపిటీసీ సభ్యులు పల్లా నీలిమ, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పెదబాబు, ఎఎంసి ఛైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, వైస్ ఎంపిపి బి.బంగారునాయుడు, దివీస్ సంస్థ సలహాదారు వరహాలరెడ్డి, సిఎస్ఆర్ అధికారి నాగరాజు, ఎండిఒ పి.వెంకటరమణ, ఇఒపిఆర్‌డి శంకర్ జగన్నాధ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కలలను నిజం చేయాలి



మాట్లాడుతున్న మేకా నరేంద్రకృష్ణ

ప్రజాశక్తి -తగరపువలస : తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ విద్యార్థులకు సూచించారు. శశి విద్యా సంస్థల ప్రాంగణంలో 7 నుంచి 10, 10+1 విద్యార్థులకు ఆదివారం ఐఐటి, నీట్ విద్యపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులందరిలో సామర్థ్యం ఒకేలా ఉండదని, వారి సామర్థ్యాన్ని అంచనా వేసి, చదువులో మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని చెప్పారు. శశి విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం అలవడేలా తీర్చిదిద్దు తామన్నారు. సుమారు 5వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరైన ఈ సదస్సులో శశి విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి సుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం : ప్రభుత్వ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఆదివారం వెల్లంకి గ్రామస్తులు సన్మానించారు. వెల్లంకి గ్రామానికి చెందిన ఉప్పాడ హరిణి విశాఖపట్నం ప్రభుత్వ మహిళ కళాశాలలో ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపు చదివి 932 / 1000 మార్కులు సాధించినందుకు గ్రామ పెద్దలు, వైసిపి నాయకులు అభినందించారు. హరిణి మరింత బాగా చదివి వైద్య విద్యనభ్యసించి ఉత్తమ డాక్టర్‌గా పేదలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, వైసిపి నాయకులు కాకర వెంకటరమణ, పిన్నింటి వెంకటరమణ, కంటి మహంతి చంద్రమౌళి, పడాల రాము, హరిణి తల్లితండ్రులు నారాయణరావు, కనకమహాలక్ష్మి, ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బిఆర్‌టిఎస్ రోడ్డు పందులపాం సమీపంలో చోటు చేసుకుంది. ఆరిలోవ పోలీసుల కథనం ప్రకారం... సీతమ్మధార, టిపిపి కాలనీలో నివాసం ఉంటున్న బండారు శ్రీరామమూర్తి(60) విఎంఆర్‌డిఎలో డ్రాఫ్ట్‌మేన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం తన స్వగ్రామానికి వెళ్లి బిఆర్‌టిఎస్ రోడ్డు అడివివరం వైపు నుంచి హనుమంతువాక వైపు బైక్‌పై వస్తుండగా పెదగదిలి దాటిన తరువాత ముందు ఉన్న ద్విచక్రవాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఆ వాహనాన్ని ఢీకొట్టారు. బైకు అదుపు తప్పి కింద పడిపోయారు. శరీరంపై దెబ్బలు కనబడక పోయినా అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు శ్రీరామమూర్తికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు చక్రధర్, శ్రావణ్ ఉన్నారు. ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని కెజిహెచ్ మార్చురికి తరలించారు.

బైక్ బోల్తా పడి యువకుడు మృతి

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతిచెందాడు. భీమిలి ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం... విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసకు చెందిన నమ్మి రాంబాబు (23), లొడగల వెంకటేష్ కలిసి మోటారు బైక్ పై విజయనగరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సొంతూరు వస్తుండగా మార్గమధ్యంలో దాకమర్రి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనాన్ని డ్రైవ్ చేస్తున్న రాంబాబు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో సంగివలసలోని అనిల్ నీరు కొండ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అదే రోజు రాత్రి 9.20 గంటలకు మృతి చెందాడు. మృతుని తండ్రి నమ్మి నారాయణప్పడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో ఎఎల్ పురం బస్టాండ్ వద్ద 18 కిలోల గంజాయి, నలుగురు నిందితులను పట్టుకున్నామని కృష్ణదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం ఏఎల్ పురం బస్టాండ్ లో బస్ కోసం వేచి చూస్తున్న తమిళనాడుకు చెందిన నలుగురును పోలీసులు తనిఖీలు చేశారు. వారి దగ్గర ఉన్న బ్యాగుల్లో 18 కేజీల గంజాయి దొరికింది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన శంకర్, శక్తివేర్, శివశక్తి, నూర్ మహమ్మద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుండి రూ.1500 నగదు, రెండు సెల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లుగా ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి : డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు రూరల్ సిఐ ఎ రవికుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలివి. అనకాపల్లి మండలం దిబ్బపాలెం గ్రామానికి చెందిన పెంటకోట మధుకుమార్ అనకాపల్లి సాయి కుల్వంత్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన పెంటకోట కన్నంనాయుడు వద్ద దఫదఫాలుగా అధిక వడ్డీకి రూ.92 వేలు అప్పు తీసుకున్నాడు. ఇందుకుగాను రూ. 33 వేలు వడ్డీగా కూడా చెల్లించాడు. అయితే అసలు వడ్డీ చెల్లించమని మధు కుమార్‌పై ఒత్తిడితోపాటు బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో మధుకుమార్ ఈనెల 23న ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. తక్షణమే అతనిని ఆసుపత్రికి తరలించగా ఈనెల 25న మృతి చెందాడు. దీనిపై రూరల్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడు కన్నం నాయుడును అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్టు సీఐ రవికుమార్ తెలిపారు.

అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నత పాఠశాల 1988వ సంవత్సరం పదోతరగతి విద్యార్థులు ఆదివారం ముడసర్లోవ పార్కులో కలుసుకున్నారు. పూర్వ విద్యార్థి సారధులైన వై.శ్రీనివాసరావు, ఎన్.జోగారావు, ఆర్.నాగరాజ్‌పట్నాయక్ ఆధ్వర్యాన ఆత్మీయ కలయిక నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న వారంతా హాజరయ్యారు. పాఠశాల దశలోని తమ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. పి.చంద్రశేఖర్, బండారు దేవుడులు వినోద, విజ్ఞానాత్మక ఆటలను ఆడించి బహుమతులు అందజేసారు. ఉదయశ్రీ అన్నపూర్ణ, సిహెచ్.ప్రసాద్, కె.నర్సింగరావు, వి.త్రినాధు కో-ఆర్డినేషన్ బృందానికి సారధ్యం వహించారు. ఆనాటి మధుర జ్ఞాపకాలు ఎన్నటికీ మరువ లేమని వారంతా పేర్కొన్నారు.

లోవోల్టేజీ సమస్య పరిశీలన

ప్రజాశక్తి-గాజువాక: జివిఎంసి 65వ వార్డు పరిధి బాపూజీ కాలనీ, నేతాజీ కాలనీ, వాంబే కాలనీ, ప్రియదర్శిని కాలనీల్లో తరచూ వేదిస్తోన్న లో వోల్టేజీ సమస్యపై సంబంధిత శాఖ అధికారులతో కలిసి వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు ఆదివారం పరిశీలించారు. కాలనీల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటైతే దాదాపుగా సమస్య కొలిక్కి వస్తుందన్న అభిప్రాయానికి వచ్చారు. ఒక్కోసారి హై వోల్టేజీ రావటం వల్ల ఇళ్లల్లోని గృహోపకరణాలు కాలిపోతున్నాయని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ శాఖాధికారులను కార్పొరేటర్ కోరారు. పాడైన విద్యుత్ తీగలను మార్చాలని, ఫ్యూజ్ బాక్సుల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రిషీకేష్, లైన్‌మ్యాన్ సూర్యారావు, స్థానికులు ఎల్‌వి.రమణ, శ్రీనివాసరాజు, రామకృష్ణ, ఈశ్వరరావు, నారాయణమూర్తి, పెంట్ర రాజు, మక్కా కృష్ణ, శరగడం కృష్ణ, సత్యారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు.



ఒకటో తరగతి ప్రవేశం పొందిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు తదితరులు

కెవిలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురంలోని కేంద్రీయ విద్యాలయంలో నూతనంగా 1వ తరగతిలో చేరిన విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయని ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు తెలిపారు. ఒకటవ తరగతిలో చేరిన విద్యార్థులకు వారు తల్లిదండ్రులకు ఆయన పలు సూచనలు, సలహాలు అందజేశారు. కచ్చితంగా సమయపాలన, శుభ్రత పాటించాలని, సరిగా ఉండాలని తెలిపారు. లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి -కరాస: విశాఖపట్నం డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎన్ఎస్‌టిఎల్ ఇండోర్ స్టేడియంలో ఇంటర్ ఇనిస్టిట్యూషనల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. విశాఖపట్నంలో ఉన్న వివిధ సంస్థలకు చెందిన 16 టీమ్స్ పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో విడిటిటిఎ సెక్రటరీ శర్మ, చంద్రశేఖరరావు, జిఎన్.వర్మ, నాగభూషణం, సిహెచ్.జయరావు, ఎస్‌కె.సాహూ పాల్గొన్నారు.



వేసవి బాక్సింగ్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్న కోచ్‌లు

శ్రీహరిపురంలో బాక్సింగ్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి -ములగాడ : శ్రీహరిపురం ఎంఐజి క్రీడా మైదానంలో మైక్ టెక్స్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యాన వేసవి బాక్సింగ్ శిక్షణ తరగతులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాక్సింగ్ కోచ్‌లు మాట్లాడుతూ బాక్సింగ్ శిక్షణ తరగతులు వేసవికాలంలోనే కాకుండా ప్రతిరోజూ ఈ మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు వచ్చి శిక్షణ పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మజ్జి రమేష్, కార్యదర్శి షైక్ ఆలీ, గణేష్, హరి, సాయి, బైపిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విసిసి సమ్మర్ క్యాంపు వర్క్‌షాప్



బిఎన్ఆర్ భవనంలో ఏర్పాటుచేసిన శిక్షణలో పాల్గొన్న వాలంటీర్లు

ప్రజాశక్తి-యంత్రాంగం

కంచరపాలెం : కంచరపాలెంలోని బిఎన్ఆర్ భవనంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరాన్ని రోటరీ క్లబ్ ప్రతినిధి మోదంబికా ప్రారంభించారు. పిల్లలే రీసోర్స్ పర్సన్స్‌గా సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారు. ఈ వర్క్‌షాపునకు పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, జగదాంబ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ఈ ప్రాంతాలలో సుమారు 30 చోట్ల విసిసి క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ శిబిరాలు మే 3 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయి. గుర్తించిన వాలంటీర్లకు ఐస్ బ్రేకింగ్ ఆక్టివిటీస్, సైంటిస్ట్ గేమ్, క్లాప్, వాక్, జంప్, చెవిలో మాట, కమ్యూనిటీ గేమ్స్, నంబర్ గేమ్స్, మెమరీ గేమ్స్, టీం గేమ్స్ నేర్పించారు. న్యూస్ పేపర్‌తో వివిధ రకాల బొమ్మలు సైకల్, ఫ్రేమ్స్, ఫ్లవర్ వాజ్, రాకెట్ వంటి ఐటెమ్స్ నేర్పించారు. కలర్ పేపర్‌తో క్రాఫ్ట్‌పై ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి రోషన్, అలేఖ్య, అజయ్, కృష్ణారావు, నిఖిల్, హర్షవర్ధన్ శిక్షణ ఇచ్చారు. పై ప్రాంతాల నుంచి 50 మంది హాజరయ్యారు. ఇక్కడ నేర్చుకున్న వాలంటీర్లు వారి ఏరియాలో మిగిలిన పిల్లలతో ఇవన్నీ చేయిస్తారని విసిసి ప్రతినిధులు తెలిపారు. జోన్ కన్వీనర్స్ రజని, లీలావతి, లక్ష్మి, సతీష్, ఆలేఖ్య, చంద్రిక, నరేష్ పాల్గొన్నారు.

గాజువాక : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరాల నిర్వహణపై గాజువాకలోని స్వామి విద్యానికేతన్ పాఠశాలలో ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ ఎం.రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. వేసవిలో 15 రోజుల పాటు జరిగే కార్యక్రమానికి రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ సొసైటీ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు స్టీల్‌ప్లాంట్, మల్కాపురం, గాజువాక ప్రాంతాల నుంచి హాజరవుతారని చెప్పారు. ఈ ప్రాంతాలలో సుమారుగా 30 చోట్ల శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరాలు మే 3 నుంచి 20వ తేదీ వరకు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్స్‌గా శ్రావణి, అరుణ, సుశీల, సంధ్య వ్యవహరించారు. ఆయా ప్రాంతాల నుంచి 60 మంది హాజరయ్యారు. జోన్ కన్వీనర్లు అరుణ, అప్పారావు, శ్రావణి, చందన, పద్మ, దిలీప్ పాల్గొన్నారు.



గాజువాక స్వామి విద్యానికేతన్ పాఠశాలలో....

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా గిరిధర్ బాధ్యతల స్వీకరణ



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సత్కరిస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఇటీవల బదిలీపై వచ్చిన ఆలిపాటి గిరిధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మూడున్నరేళ్లుగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రర్‌గా సేవలందించి ఇటీవలే విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం గిరిధర్‌ను న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గిరిధర్‌ను కలిసిన వారిలో బార్ కౌన్సిల్ మెంబర్ ఎస్.కృష్ణమోహన్, కోశాధికారి చిగురుపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షులు లత ఉన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీగా ఎం.శేషమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

రాజకీయాలకతీతంగా కలిసి రావాలి

ప్రజాశక్తి-వేపగుంట : రాజకీయాలకతీతంగా కాపు కులస్తులందరూ కలిసి రావాలని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పిలుపునిచ్చారు. జివిఎంసి 95వ వార్డు పరిధి వేపగుంట దరి శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ సంఘం భవనంలో కాపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భవనానికి టిడిపి ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసి వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రారంభించుకున్నామని తెలిపారు. ఇటీవల ఈ భవనం ప్రారంభోత్సవానికి టిడిపి నాయకులకు చెప్పలేదంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదన్నారు. తానే టిడిపి కార్పొరేటర్లకు చెప్పానని తెలిపారు. పట్టుదలను విడిచి కాపు కులాన్ని బలపర్చడానికి, భవనం అభివృద్ధి పనులకు రాజకీయాలకతీతంగా ముందుకు రావాలని కోరారు. ప్రతి సమావేశానికి సోషల్ మీడియా, పత్రికల ద్వారా, వాట్సాప్ ద్వారా తెలియజేస్తున్నామని తెలిపారు. ఎవరికి ఎటువంటి సందేహాలున్నా తీర్చడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రధాన కార్యదర్శి నక్క కనకరాజు మాట్లాడుతూ, భవనం ప్రహరీ నిర్మాణానికి సహకరించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండ్రెడ్డి సంజీవరావు, తామర్ల నర్సింగరావు, మహాలక్ష్మినాయుడు, బండి సత్తిబాబు, కంచిపాటి జగదీష్, కిశోర్, సభ్యులు పాల్గొన్నారు.

10 గంటలపాటు నిర్విరామ గీతాలాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ గాయకులు, రిటైర్డ్ ఎడిసిపి మహమ్మద్ ఖాన్ 10 గంటల పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడలో 15 మంది మహిళా గాయనిల గళ సహకారంతో 160 పాటలు పాడారు. ఉదయం 8.32 నుంచి సాయంత్రం 6.32 గంటల వరకు నిర్విరామముగా పాటలు ఆలపించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పారు. మహమ్మద్ ఖాన్‌కు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో-ఆర్డినేటర్ కోరుకొండ రంగారావు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కో-ఆర్డినేటర్ వేముల భాస్కరాచారి రికార్డు సర్టిఫికెట్లు అందజేశారు. మహమ్మద్ ఖాన్‌ను ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కోస్ట్ గార్డ్ కమాండర్ యోగేంద్ర దాకా, ఆత్మీయ అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి సోమేశ్ బృందం వాయిద్య సహకారాన్ని అందించగా సత్యవతి, రుషి బెహరా, జ్యోతి, శైలజ మీరజ్, భాగ్యలక్ష్మి, మీనా కుమారి, గీత, నాగలక్ష్మి, శ్వేత, శ్రీదేవి, సుజాత, మాధురి, సుకన్య, సావిత్రి, మల్లిక గీతాలను ఖాన్‌తో కలిసి ఆలపించారు. ఈ కార్యక్రమంలో యోగా భాస్కర్, ఆశామధు, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు, నాంచారయ్య, ఎఎం.ప్రసాద్, యాదకుమార్, రాథో గణేష్, సన్‌మూర్తి పాల్గొన్నారు.



నిర్విరామ పాటలు పాడుతున్న మహమ్మద్ ఖాన్

సాగర తీరంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి -మధురవాడ : జోడుగుళ్లపాలెంలో సాగర తీర స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాధన్, జీవీఎంసీ కమిషనర్ సిఎమ్.సాయికాంత్ వర్మ, డిఎం అండ్ హెచ్‌ఒ కార్యాలయ సిబ్బంది, కెజిహెచ్ సూపరింటెండెంట్, డిఇఒ, డైట్ కళాశాల విద్యార్థులు, జీవీఎంసీ, విఎంఆర్‌డిఎ సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు, స్థానికులు పాల్గొని బీచ్‌లో చెత్తను ఏరివేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 టన్నుల చెత్తను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : బూత్ స్థాయిలో టిడిపిని బలోపేతం చేసేందుకు అధిష్టానం పిలుపు మేరకు చిట్టివలసలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో తెలుగుదేశం శ్రేణులకు ఆదివారం ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు మాట్లాడుతూ, 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలవద్దకు తీసుకెళ్లాలన్నారు. నూతన ఓటర్ల చేరిక, తొలగింపుపై పార్టీ వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలు దృష్టి పెట్టాలని కోరారు. ఓటర్ల హౌస్ హోల్డ్ మ్యాపింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా నూకరాజు, కె.లీలావతి, కె.దామోదరరావు, కోరాడ రమణ, పిట్టా సురేష్, టి.సూరిబాబు, వి.సత్య, బి.నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.


చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక వై జంక్షన్ వద్ద 15 రోజుల క్రితం ఆటో కార్మికులు ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం కొనసాగుతూ ఉంది. అక్కరమాని దుర్గ ఆర్థిక సాయంతో ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి ఆటో కార్మిక సంఘం (సిఐటియు) గౌరవాధ్యక్షులు నీలాతి రాము, అధ్యక్షులు పల్లా పెంటరాజు, కార్యదర్శి నమ్మి నాయుడు, సభ్యులు బి.శ్రీను, చక్రధర్, కోరాడ ఎల్లాజీ, దువ్వి శివ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామ స్వరాజ్యం

ఉత్తరాంధ్ర వైసిపి ఇన్‌ఛార్జి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- దేవరాపల్లి : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సచివాలయ వ్యవస్థతోనే సాధ్యమని ఉముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో సర్పంచ్, మండల వైసిపి పార్టీ అధ్యక్షుడు బూరె బాబురావు అధ్యక్షతన గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కాశీపురం నుంచి గవరవరం రోడ్డు వరకు రూ.200 లక్షలతో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం శారదా నది ఒడ్డున ఏర్పాటుచేసిన దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆమెకు తినిపించారు. పార్టీ శ్రేణులంతా ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. అంతకుముందు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, గ్రామ సర్పంచ్ బూరె బాబురావు తో కలిసి గ్రామంలో పర్యటించి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ, ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, జడ్పిటిసి కర్రీ సత్యం, కే.కోటపాడు జడ్పిటిసి ఈర్లే అనురాధ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, ప్రభుత్వ అధికారులు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు, నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.


రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణలో సుబ్బారెడ్డి, ఉపముఖ్యమంత్రి బూడి

గవరవరం వద్ద వంతెన ప్రారంభం

చోడవరం : గవరవరం వద్ద శారదానదిపై నిర్మించిన వంతెనను ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ సత్యవతి, చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో బ్రిడ్జి శంకుస్థాపన జరిగిందని, తెలుగుదేశం ప్రభుత్వం పూర్తిగా విస్మరించడంతో ఇన్నాళ్లు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించి, నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తెస్తున్నట్లు వెల్లడించారు.కార్యక్రమంలో చోడవరం మాడుగుల నియోజకవర్గాల వైసిపి ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా చోడవరం నుండి గవరవరం వరకు వైసిపి శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు.


వంతెన ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

మేడే ఉత్సవాలకు ఏర్పాట్లు


సిపిఎం కార్యాలయం వద్ద మేడేకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -.అనకాపల్లి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సిపిఎం కార్యాలయం వద్ద, ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద, ఆర్ఎఆర్ఎస్, బైపాస్ ముఠా కార్మిక సంఘం, జిల్లా ముఠా కార్మిక సంఘం, హమాలీవర్కర్స్ యూనియన్, గాంధీ కూరగాయల మార్కెట్, బేవరేజెస్ కంపెనీ తదితర ప్రాంతాల్లో మేడే ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మే డే ఉత్సవాల్లో కార్మికులు కర్షకులు, అసంఘటిత కార్మికులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు.

మేడే సభను జయప్రదం చేయండి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బుద్ధ నాగజగదీష్, టిడిపి నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గాజువాక లంక గ్రౌండ్స్‌లో నిర్వహించే కార్మిక సభను విజయవంతం చేయాలని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, నియోజకవర్గ ఇన్చార్జీలు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, పి వి జె కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలోకార్మిక సభ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిఎన్‌టియుని రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రామకృష్ణరాజు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు ముఖ్యఅతిథిగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు హాజరవుతున్నారన్నారు. ఈ సభకు కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, టిడిపి శ్రేణులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధనాల విష్ణు చౌదరి, పిట్ల రాజు, ఆకుల నానాజీ, కోట్ని రామకష్ణ, పొలిమేర నాయుడు, బుద్ధ భువనేశ్వర్, దూలం ప్రసాద్, అక్కిరెడ్డి రమణబాబు, విల్లూరి సత్తిబాబు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న'కు స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అనూహ్య స్పందన లభించిందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 7 నుంచి 29 వరకు నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా. పెందుర్తి నియోజకవర్గంలో 91,166 ఇళ్లకుగాను, 76,823 ఇళ్లకు వెళ్లడం ద్వారా 84.27శాతం పూర్తి చేశామన్నారు. మిగిలిన వారిని త్వరలో కలుస్తామన్నారు. క్షేత్రస్థాయిలో వైసిపి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉందనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఇంటింటా గోడలకు స్టిక్కర్లు అతికించామనానరు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ తుంపాల అప్పారావు, ఎంపిపి బోకం సూర్యకుమారి రాము నాయుడు, వైసిపి నేతలు కోటాన రాము, సబ్బవరపు ముత్యాల నాయుడు,వెన్నల సన్యాసిరావు, గొర్లి ఉమా మహేశ్వరరావు, వడ్డాది అప్పలరాజు, పాలిశెట్టి సురేష్, యడ్ల నాయుడు, బోను నాయుడు, నేబర్తి శ్రీనివాసరావు, దెడ్డము పద్మావతి, బంతికోళ్ల పద్మ, పెచ్చెట్టి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


మజ్జిగ పంపిణీ చేస్తున్న సిఐటియు ముఠా కార్మికులు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి ఎంపి డాక్టర్ బివి సత్యవతి జన్మదినాన్ని పురస్కరించుకొని బైపాస్ ముఠా వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో అధ్యక్షులు మంద రాము నేతృత్వంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యవతి మాట్లాడుతూ 40 ఏళ్లుగా అనకాపల్లి జిల్లా ముఠా వర్కర్స్ యూనియన్ హైవే రోడ్‌లో విధులు నిర్వహిస్తూ అక్కడే పూరిపాక వేసుకొని విశ్రాంతి తీసుకునేవారు. జాతీయ రహదారి నిర్మాణం, ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు నేపథ్యంలో వీరి పాకను తొలగించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇదే స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణానికి అనుమతికి సహకరిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మైచర్ల గంగాభవాని, కోశాధికారి వి అప్పారావు, కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రభుత్వ పథకాల మంజూరు, అమలులో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తెస్తే వాటిని పరిశీలించి పరిష్కరించి న్యాయం చేస్తాననిఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. ఆదివారం సెజ్‌లోని దిబ్బపాలెం పునరావస కాలనీలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా తన సొంత నిధులతో కొనుగోలు చేసిన బ్యాగులను వాలంటీర్లకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ యు సుకుమారవర్మ, వైసిపి నేతలు కోన బుజ్జి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకరరావు, రాజన్న విజయ్, అడిగర్ల దేవుడు, సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

ప్రజాశక్తి -వడ్డాది : ట్రాయ్, బ్రాడ్ కాస్టర్లు పెంచిన కేబుల్ రేట్లను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ గ్రామీణ కేబుల్ ఆపరేటర్లు నిరసన చేపట్టారు. వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్ కూడలిలో గ్రామీణ కేబుల్ ఆపరేటర్స్ సంఘం అధ్యక్షుడు బేతి వెంకటరమణ, గౌరవ అధ్యక్షులు దొండా రమేష్ ఆధ్వర్యంలో గ్రామీణ కేబుల్ ఆపరేటర్స్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బేతి వెంకటరమణ మాట్లాడుతూ:గ్రామీణ ప్రాంత వినియోగదారులకు భారమయ్యేంతగా కేబుల్ రేట్లను పెంచి, వారికి వినోదాన్ని, విజ్ఞానాన్ని దూరం చేయడం సరికాదన్నారు. కేబుల్ ఆపరేటర్స్ అధిక రేట్లు పెంచలేదని, బ్రాడ్‌కాస్టర్లు పెంచిన రేట్ల వివరాలను చానల్స్‌లో ప్రకటనలుగా ఇవ్వాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షులు దొండా రమేష్ మాట్లాడుతూ, కేబుల్ రంగంలో కార్పొరేట్ల ప్రభావం వల్లే ఒకపుడురూ.150కే ఇచ్చే ఛానల్స్‌ను ఇపుడు రూ.600కూడా ఇవ్వలేకపోతున్నామన్నారు ప్రతి చానల్స్‌కు ఒక రేటు విధించి, దానికి జిఎస్‌టి జత చేసి వసూలు చేస్తుండడంతో వినియోగ దారులపై భారం తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పాలిసెట్టి సత్తిబాబు, కోశాధికారి నడిపల్లి నాగేశ్వరరావు ,కార్యదర్శి కొప్పురమణ ఎనిమిది మండలాల గ్రామీణ కేబుల్ ఆపరేటర్స్ పాల్గొన్నారు

వర్తక సంఘం ఘోషాసుపత్రి కార్యదర్శిగా కన్నబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జార్జి క్లబ్ పతంజలి యోగ సమితి అధ్యక్షులు కోలపర్తి కన్నబాబును వర్తక సంఘం వెంకటస్వామినాయుడు ప్రసూతి ఘోషాసుపత్రి కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం వర్తక సంఘం ఘోషాసుపత్రిలో ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమ్మ నాయుడు, జార్జి క్లబ్ ప్రతినిధులు డాక్టర్ డి డి నాయుడు, బుద్ధ కాశి విశ్వేశ్వరరావు, పెంటకోట సుబ్రమణ్యం, యోగ కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


కన్నబాబును సత్కరిస్తున్న దొరమ్మనాయుడు

ఉపాధ్యాయుల గృహ నిర్బంధం


గృహ నిర్బంధంలో ఉన్న ఉపాధ్యాయనేత శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కె.కోటపాడు: ఉపాధ్యాయుల సమస్యలపై సోమవారం విశాఖపట్నంలో ర్యాలీ చేపడుతున్న కార్యక్రమానికి వెళ్లకుండా ఉపాధ్యాయ సంఘం నాయకులను స్థానిక పోలీసులు ఆదివారం వారి ఇళ్ల వద్ద నిర్బంధించారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సూరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ చేపడుతున్న శాంతియుత ర్యాలీని భగ్నం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఉపాధ్యాయుల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాలసేకరణ కేంద్రం ప్రారంభం



పాలు పోస్తున్న మహిళా పాడిరైతులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని కుమారపురం గ్రామంలో హెరిటేజ్ డెయిరీ నూతన పాల సేకరణ కేంద్రాన్ని ఆ డెయిరీ రీజనల్ మేనేజర్ పి నాగ అప్పారావు ఆదివారం ప్రారంభించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా హెరిటేజ్ డెయిరీ ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు, పాడిపశువులకు రాయితీపై కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లను రూ.50కే అందిస్తోందని, అదే ఆడ దూడ పుట్టాలంటే రూ.500 ఇచ్చి ఇంజక్షన్ వేయించాలన్నారు. పాడి రైతులకు ప్రమాద బీమా సౌకర్యంకల్పిస్తోందని, ప్రమాద మరణానికి రూ. రెండు లక్షలు, సహజ మరణానికి రూ.50 వేల పరిహారాన్ని బాధిత పాడిరైతు కుటుంబానికి అందజేస్తామన్నారు. హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కె శేషు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలోనే ఇతర డెయిరీల కంటే అధిక పాల ధర చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు టి రాజీవి, ఎ.వరహాలు కె.ఈశ్వరరావు డి. శ్రీధర్ కె. రమణ టి.సోమరాజు, పి సూరిబాబు, డి.ఈశ్వరమ్మ, టి అపరంజి, డి దేవి, డి.సూర్యమణి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో అన్నసమారాధన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ కాలనీ లో నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. వాసవి కన్యకాపరమేశ్వరి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, అనంతరం అన్నసమారాధనలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

పూడిమడకలో మన్ కీ బాత్ ప్రదర్శన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పూడిమడక గ్రామంలో ఆదివారం ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వందవ ఎపిసోడ్ తెలుగు అనువాద ప్రసారాన్ని ప్రదర్శించారు. పూడిమడక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, సహాయ సంచాలకులు విజయకృష్ణ, మత్స్యశాఖ అభివద్ధి అధికారి వెంకట రవితేజ, మెరైన్ ఎస్ఐ మల్లేశ్వరరావు, మెరైన్ మహిళా ఎస్ఐ స్వీటీ, ఒరుపుల జయశంకర్, మత్స్యకార నాయకులు పేర్ల సూరరాజు, మెరుగు బాపయ్య, కోవిరి మహేష్, మెరుగు నోకాలమ్మ మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట గ్రామ శివారు నేతవానిపాలెం గ్రామంలో కుక్కల దాడిలో లేగదూడ మృతి చెందింది. నేతవానిపాలెం గ్రామానికి చెందిన వియ్యపు యతేంద్రకు చెందిన పశువులపాక వద్ద ఆవు,దూడను కట్టి ఆదివారం ఉదయం కళ్ళం వద్ద వెళ్లి చూసేసరికి కుక్కలు కలవడంతో దూడ మృతి చెందింది. దూడ వారం రోజుల క్రితమే జన్మించింది. కొద్దిరోజులుగా వీధికుక్కల స్వైర విహారం చేస్తూ పశువులను మేకలను చంపుతున్నాయి. దీంతో పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. వీధికుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు, బాధత పెంపకందారులను ఆదుకోవాలని కోరుతున్నారు.



కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం మొండి వైఖరి తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం నిరంకుశ వైఖరి విడనాడాలని నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారానికి 759వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో డిఫెన్స్ కో - ఆర్డినేషన్ కమిటీ అధ్వర్యంలో నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. దీక్షల్లో ఎన్ఎసి యూనియన్ జనరల్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ భానోజీ బిల్లా, కోశాధికారి గ్రెగొరీ, కో - ఆపరేటివ్ సొసైటీ కోశాధికారి గణేష్, డైరెక్టర్ చైతన్య వాసు, మూర్తి పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న రక్షణరంగ ఉద్యోగులు

స్వార్థ రాజకీయాల్లో సిఎం జగన్‌కు సాటిలేరు!



మాట్లాడుతున్న నాగ జగదీష్

ప్రజాశక్తి- అనకాపల్లి : తన స్వార్థ ప్రయోజనాల కోసం సొంత కుటుంబాన్ని సైతం బలిచేసే జగనాసురుడు జగన్‌రెడ్డి అని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, 2014 ఎన్నికల్లో తన తండ్రి మరణాన్ని రాజకీయంగా వాడుకొని ఎన్నికల్లో లబ్ది పొందాలని జగన్‌రెడ్డి చూశారన్నారు. 2019 ఎన్నికల్లో తన పినతండ్రి వివేకానంద రెడ్డిని హతమార్చి తన సంకల్ప యాత్రకు శ్రీకారం చుట్టారని ఆరోపించారు. ఎలమంచిలి ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ సాక్షి దినపత్రికలో వివేకానందరెడ్డి హత్య కేసును గుండెపోటుగా ప్రకటించి అనంతరం నారాసుర రక్త చరిత్రగా టిడిపిపై బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. చోడవరం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తుతో అసలైన నిందితులు త్వరలో తెరపైకి రానున్నారన్నారు మాడుగుల ఇన్‌ఛార్జి పివిజి కుమార్ మాట్లాడుతూ ఇటు ప్రజలకు, అటు అధికారులకు తెలియకుండా రాష్ట్ర సంపదను ఎలా దోచుకోవాలో జగన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు ధనాల విష్ణు చౌదరి, సీనియర్ నాయకులు కొట్టి రామకృష్ణ, మాడుగుల పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ రాము పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి -మునగపాక రూరల్: విద్యార్థులు వేసవి సెలవులలో చదువుతోపాటుగా ఆటలు, క్రీడల్లో రాణించాలని, సర్పంచ్ దిమ్మల అప్పారావు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాలలో వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు సూచన లేకుండా బయట తిరగరాదన్నారు. చెరువులు, కాలువల వద్దకు వెళ్లి ఈతలు ఈదటం వంటి సాహసోపేత చర్యలు పనికిరావన్నారు. ఎండలు తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో బయట తిరగరాదని అన్నారు. వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. అనంతరం 'స్పందించే హృదయం ఛారిటబుల్ సంస్థ' అందించిన గుడ్డ సంచులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సావిత్రి, స్పందించే హృదయం ఛారిటబుల్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కెవి రమణ, అసిస్టెంట్ సెక్రటరీ శివకోటి దుర్గాప్రసాద్ ,వార్డు మెంబర్ వేగి కృష్ణ, బొడ్డేడ అప్పారావు పాల్గొన్నారు.

వైభవంగా పోలమాంబ ఉత్సవాలు



పైడారావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక పూడిమడక రోడ్డు ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో రెల్లి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోలమాంబ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావు ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనకు స్వాగతం పలికి సాలువతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు సోమాదుల రాజు, కార్యదర్శి నిమ్మకాయల నరసింహామూర్తి, పొట్నూరి గోవింద, చిన్న బాబు, సింగంపల్లి పైడితల్లి పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు ముడుపులు తీర్చుకున్నారు. అలాగే ఆలయం వద్ద వంటలు వార్పులు చేసుకుని కుటుంబాలతో సహ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దేవాదాయ శాఖ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలింతల కోసం ప్రత్యేక గదిని కట్టించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ బండారు ప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జూపూడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -వద్దాది : ఎస్‌సిసెల్ రాష్ట్ర అధ్యక్షులు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ పుట్టినరోజు వేడుకలను మాల మహానాడు విశాఖ జిల్లా యువజన అధ్యక్షుడు కోటి ఆధ్వర్యంలో వద్దాది లో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి విశాఖ మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, వైసిపి నేతలు, దళిత, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో నిర్వహిం చిన జూపూడి ప్రభాకర్ జన్మదిన వేడుకల్లో చోడవరం జెడ్‌పిటిసి శ్రీకాంత్, జాతీయ యాదవ సంఘం కార్యదర్శి అప్పారావు, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మాల మహానాడు అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసు, మహిళా అధ్యక్షురాలు మరియమ్మ, అమ్మ తల్లి, భాస్కర్. రాజు, భాగ్య నాగేశ్వరరావు పాల్గొన్నారు

కంప్యూటర్, చిత్రలేఖనంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక శ్రీ గౌరీ గ్రంథాలయంలో ఈనెల మూడు నుంచి నెలరోజులపాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ, అలాగే నాలుగో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉచిత చిత్రలేఖనం శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ శిక్షణలో ఫండమెంటల్స్, విండోస్, ఎమ్మెస్ వర్డ్, ఎమ్మెస్ ఎక్సెల్, పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్‌లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల విద్యార్థులు గ్రంథాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే చిత్రలేఖనం శిక్షణ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ప్రతిరోజు 15 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. వేసవిసెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనే సంకల్పంతో ఈ ఉచిత శిక్షణలను ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 9247187355 నెంబర్ను సంప్రదించాలన్నారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖ) : భారత మహిళా రెజ్లర్లు తమకు న్యాయం కావాలని రోడ్డు మీదకు వచ్చి ధర్నా చేయడం అత్యంత బాధాకరమని, ఇటువంటి తరుణంలో వారికి న్యాయం చేయాలని ఎల్ఐసి వర్కింగ్ ఉమెన్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి.సూర్యప్రభ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డబ్ల్యుఎఫ్ఐ చైర్మన్, బిజెపి నాయకుడు బ్రిజ్ భూషణ్ సింగ్ చాలా కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని, అతని దురాగతాలకు క్రీడాకారులు బలవుతున్నారని గతంలోనే రెజ్లర్లు ఆందోళనకు దిగిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చి మాట తప్పడం దారుణమన్నారు. న్యాయం కోసం పోరాడుతున్న మహిళా క్రీడాకారులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.

వ్యవసాయంలో స్థిర వృద్ధిపై ఒప్పందం

ప్రజాశక్తి - కలెక్టరేట్(విశాఖ) : వ్యవసాయంలో స్థిరమైన వృద్ధి లక్ష్యంగా లీడ్స్ కనెక్ట్, ఇక్రిశాట్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయని లీడ్స్ కనెక్ట్ సర్వీసెస్ చైర్మన్ నవనీత్ రవికర్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మిరప, పప్పులు, పసుపు విలువ గొలుసుపైనా, వ్యవసాయ విలువ గొలుసులోని అగాధాలను మూసివేయడంపైనా లీడ్స్ కనెక్ట్ సర్వీసెస్‌కు సహకరించడానికి కొత్త మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. ఉత్పత్తులకు మంచి ధరను అందించడం ద్వారా సంఘాలను బలోపేతం చేయడం ఎంతైనా అవసరమన్నారు.

నిరాశ్రయ వసతి గృహాల్లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్(విశాఖ) : నగరంలోని జివిఎంసి నిరాశ్రయ వసతి గృహాలలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించారు. సత్యసాయి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఎయుటిడి నిరాశ్రయ వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో 89 మంది నిరాశ్రయ స్త్రీ, పురుషులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 31వ వార్డు కార్పొరేటర్ జె.బిపిన్ కుమార్ జైన్, ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి- మునగపాక రూరల్: అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకటసత్యవతి జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో వాడ్రాపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సాగర్ హెల్త్ కేర్ వైద్యులు ఎం. హరిప్రసాద్ (ఛాతి వైద్య నిపుణులు), పెతకం శెట్టి లలితాస్వర్ణ (కేన్సర్ వైద్య నిపుణులు), దంత వైద్య నిపుణులు పాల్గొని రోగులకువైద్య సేవలు అందించారు. ఈ శిబిరానికి వాడ్రాపల్లితో పాటు నాగవరం, గొల్లలపాలెం, కుంచవానిపాలెం, మల్లవరం తదితర గ్రామాల నుండి 300 మంది వైద్య సేవలను వినియోగించుకున్నారని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. కార్యక్రమంలో పెతకంశెట్టి భాస్కరరావు, మళ్ల కన్నమనాయుడు, మళ్ళ జోగారావు, కాండ్రేగుల రామజోగినాయుడు, మళ్ళ శేషుబాబు పాల్గొన్నారు.

ఒటిఎస్ హక్కు పత్రాలు ఇచ్చేదెన్నడో?

-రూ.10 వేలు చెల్లించినా నేటికీ ఇవ్వని వైనం



ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ గృహ నిర్మాణం హక్కు పథకం పేరుతో సంచలనాత్మక నిర్ణయంతో గతంలో నిర్మించుకున్న కాలనీ ఇల్లు, ఇళ్ల స్థలాలు సర్వ హక్కులకై వన్ టైం సెటిల్మెంట్ (ఓటిస్) పేరుతో సంచలన నిర్ణయంపై ప్రతిపక్షం చేసిన దుమారం నేటికీ లబ్ధిదారుల కళ్ళల్లో సాక్షాత్కరిస్తూనే ఉంది. చాలా మందికి నేటికీ కాలనీ ఇళ్లపై సంపూర్ణ హక్కులు అందక హక్కుల కోసం ఎదురుచూస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో గతంలో నిర్మించుకున్న కాలనీ ఇళ్లకు సర్వహక్కులు అందజేస్తామని ఓటిఎస్ పేరుతో లబ్ధిదారుల నుండి 10వేల రూపాయల చొప్పున ప్రభుత్వం కట్టించుకున్న విషయం తెలిసిందే. దీనిపై రేగిన దుమారం అంతా ఇంతా కాదు. నిర్మించుకున్న గృహాలపై రుణాల మాఫీతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు అందజేస్తామని చెప్పి నేటికీ కొన్ని గ్రామాలలో హక్కు పత్రాలు అందక రుణాలు మాఫీ కాక, కొత్త రుణాలు మంజూరు కాక అవస్థలు పడుతున్నారు. అంతే కాకుండా ఓటిఎస్ చెల్లించినట్లయితే 22ఎ నిబంధనలు కూడా తొలగిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

మండలంలో ఓటిఎస్ విధానం అమలు చేసే నాటికి 5785 మంది లబ్ధిదారులు గృహాల నిర్మాణాలు చేసుకోగా వీటిపై రెవెన్యూ అధికారులు పంచాయతీ అధికారుల అనుమతితో 4341 మంది లబ్ధిదారులు సర్వహక్కులు కలిగి ఉండగా 1,444 మంది లబ్ధిదారులు హక్కు పత్రాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఓటిఎస్ విధానానికి పది వేల రూపాయలు చొప్పున చెల్లించారు. నేటికీ మండలంలో 19 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి సుమారు 350 మంది లబ్ధిదారులకు సంబంధించి వివిధ కారణాలతో అధికారుల నుంచి అనుమతి పొందక పోవడంతో హక్కు పత్రాల కోసం వేచి చూస్తున్నారు. హక్కు పత్రాలు అందక పోవడంతో వివిధ అవసరాలకు బ్యాంకు రుణాలు అందుతాయని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటీఎస్ పేరుతో డబ్బులు చెల్లించామని నేటికీ హక్కు పత్రాలు అందక అట్టుకు ముక్కకు చెందని చందంగా తయారైందని పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి హక్కు పత్రాలు అందజేయాలని ఆయా గ్రామాల లబ్ధిదారులు కోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

పంచాయతీ షాపుల అమ్మకం

పట్టించుకోని అధికారులు



గౌతమి సెంటర్‌లో ఉన్న పంచాయతీ షాపులు

ప్రజాశక్తి-పాయకరావుపేట: నిబంధనలకు విరుద్ధంగా పాయకరావుపేట పంచాయతీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులను కొంతమంది వ్యాపారస్తులు వేరే వారికి అమ్మేస్తున్నారు. అలా చేయడం నిబంధనలకు విరుద్ధం అని తెలిసినా అధికారులు లంచాలు దిగమింగి పట్టించుకో లేదు. షాపులు కనుగోలు చేసిన వ్యక్తి కూడా పంచాయతీ నిర్ణయించిన అద్దె అందరిలాగే యధావిధిగా చెల్లించాలి.

పాయకరావుపేట పంచాయతీకి చెందిన షాపులు స్థానిక గౌతమి థియేటర్ సెంటర్లో సుమారు 15 షాపులు పైగా ఉన్నాయి. ఈ షాపులన్నీ అప్పటి నిబంధనల ప్రకారం ఆక్షన్ నిర్వహించి షాపులు కేటాయించారు. ప్రతి మూడు సంవత్సరాలకి ఒకసారి షాపుల్లో ఉంటున్న వ్యాపారస్తులు పంచాయతీ ద్వారా రెన్యూవల్ చేసుకోవాలి. ఇందులో భాగంగా పంచాయతీ నిబంధన ప్రకారం పెంచిన అద్దె సొమ్ము కట్టేందుకు అంగీకరిస్తూ షాపు కేటాయించినప్పుడే షాపుదారుడు నుంచి పంచాయతీ నిబంధనలతో కూడిన సంతకం తీసుకుంటుంది. పంచాయతీ నిబంధన ప్రకారం షాపు నడపలేని వ్యక్తి లేదా అద్దె చెల్లించలేని వ్యక్తి ఆ షాపును పంచాయతీకి అప్పగించాలి. మళ్లీ పంచాయతీ నిబంధనల ప్రకారం ఆ షాపును ఆక్షన్ పెట్టి కొత్తవారికి కేటాయిస్తుంది. పంచాయతీ పరిధిలో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన సుమారు ఆరు షాపులతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్‌లో అప్పటి పంచాయతీ ఆక్షన్ పెట్టారు. ఆ షాపుల్లో ఒక్కరూ ఇద్దరూ వ్యాపారుల మినహా ఎవరూ లేరు. మిగిలిన వారు అంతా ఆయా సంవత్సరాల్లో డిమాండ్‌ను బట్టి షాపులు వేరే వారికి అమ్మేశారు. ఇందులో కొంతమంది పంచాయతీ అధికారులకు లంచాలు ఎరచూపి తీసుకున్న షాపులు తమ పేరుమీద మార్చుకున్నారు. మిగిలినవారు పాత షాపు యజమాని పేరు మీదే నడుపుతున్నారు. సుమారు పది ఏళ్ల క్రితం షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్మించిన షాపులు పరిస్థితి కూడా ఇలానే ఉంది.

ఇటీవల పాత షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపును కనుగోలు చేసిన వ్యక్తి మళ్ళీ అదే షాపును ఎనిమిది లక్షలకు అమ్మేసినట్టు తెలిసింది. అమ్మే అక్కు కానీ కొనే హక్కు కానీ వీరెవరికి లేదు. పంచాయతీ అధికారుల లంచం డిమాండ్ చేసినంత డబ్బు వారికి ఇచ్చి తమ పని చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కళ్ళు తెరిచి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గ్రామ పంచాయతీలు, సచివాలయాల్లో..

సిబ్బంది భర్తీ ఏదీ?



ప్రజాశక్తి -కోటవురట్ల: మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, సచివాలయాల్ల సిబ్బంది కొరత వేధిస్తోంది. మండల వ్యాప్తంగా 25 గ్రామపంచాయతీలు, 19 సచివాలయాలు ఉన్నాయి. గ్రామపంచాయతీలో గ్రేడ్ IV, గ్రేడ్ V ఉద్యోగులు ప్రతి పంచాయతీకి ఉండాల్సి ఉండగా కేవలం అన్నవరం గ్రామపంచాయతీలో మాత్రమే గ్రేడ్ IV, గ్రేడ్ V ఉద్యోగులు ఉన్నారు. గ్రేడ్ IV ఉద్యోగులు 25 పంచాయతీలకు గాను పది మంది మాత్రమే ఉండగా 15 పంచాయతీలు ఖాళీగా ఉన్నాయి. గ్రేడ్ V ఉద్యోగులు 25 పంచాయతీలకు గాను ఆరుగురు మాత్రమే ఉండగా 19 ఖాళీగా ఉన్నాయి. వీటిలో గ్రేడ్ IV ఖాళీగా ఉన్నవి... ఎండపల్లి, జల్లూరు, బికేపల్లి ఆర్సి పాలెం, రామచంద్రపాలెం, నీలి గుంట, బోడపాలెం, ఏఎస్ పేట, చిన్న బొడ్డేపల్లి, కే.వెంకటాపురం, లింగాపురం, కైలాష్ పట్నం, గుట్టువాడ, చౌడువాడ, ఆర్సిపురం. అదేవిధంగా గ్రేడ్ V 25 గ్రామ పంచాయతీలకు గాను ఆరుగురు మాత్రమే ఉండగా 19 ఖాళీగా ఉన్నాయి. వీటిలో ఎండపల్లి, బికేపల్లి, నీలిగుంట, బోడపాలెం, పాములవాక, పీకే పల్లి, రామచంద్ర పాలెం, ఏ ఎస్ పేట, చిన్న బొడ్డేపల్లి, కొడవటిపూడి, కె.వి.పురం, పి.జగ్గంపేట, సంకపూర్, తంగేడు, కైలాస పట్నం, రాజుపేట, పొందూరు, చౌడువాడ, రామ చంద్రపురం గ్రామా లకు నియమిం చాల్సి ఉంది.

ఇదిలా ఉండగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థలోనూ ప్రధానంగా ఉండాల్సిన డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఖాళీలు ఉన్నాయి. 19 సచివాలయాలకు గాను డిజిటల్ అసిస్టెంట్లు6, వెల్ఫేర్ అసిస్టెంట్లు4 ఖాళీగా ఉన్నాయి. వెల్ఫేర్ అసిస్టెంట్లు పందూరు, చౌడువాడ, చిన్నబొడ్డేపల్లి, పీకే పల్లి, తంగేడు, ఆర్సి పాలెంలో ఖాళీగా ఉన్నాయి, డిజిటల్ అసిస్టెంట్లు పందూరు, బికే పల్లి, కొడవటిపూడి, ఆర్సిపురం సచివాలయాల్లో ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆయా గ్రామాలలో సిబ్బందిని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న ప్రసాదరావు


అన్న సమారాధన పున:ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో అన్న సమారాధన తిరిగి ప్రారంభమైంది. మాడుగులకు చెందిన న్యాయవాది శ్రీనాదు ప్రసాదరావు తన సొంత నిధులతో గత కొన్ని సంవత్సరాల నుండి అమ్మవారి ఆలయంలో ప్రతి ఆదివారం అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. కరోనా నేపథ్యంలో గత మూడేళ్లుగా ఈ కార్యక్రమం నిలిచి పోయింది. తిరిగి ఆదివారం ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేస్తున్న వందల మంది భక్తులు అన్న సమారాధనలో పాల్గొంటున్నారు.

కేజే పురం కూడలి వద్ద సంతోషి మాత ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో ఉప ముఖ్యమంత్రి సతీమణి రమణమ్మ పాల్గొన్నారు.

విచారణకు రావాలని నోటీస్

ప్రజాశక్తి గొలుగొండ: మండలంలో పాకలపాడు పంచాయతీలో గతంలో జరిగిన అవకతవకలపై లోకాయుక్తకు గ్రామానికి చెందిన మాకిరెడ్డి వెంకటరమణ చేసిన ఫిర్యాదు పై తిరిగి లోకాయుక్త కు హాజరు కావాలని శనివారం నోటీసులు ఇచ్చారు. గతంలో పాకలపాడు గ్రామంలో విఆర్వో సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వి సత్యనారాయణలు అవినీతికి పాల్పడ్డారంటూ గ్రామానికి చెందిన వెంకటరమణ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పట్లో అధికారులు విచారణ చేసి అవినీతికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి నుండి ఇంటి పన్నులు రూపంలో వసూలు చేసిన 3 లక్షల 4 వేల811 రూపాయలను డిఎల్‌పిఓ ఆధ్వర్యంలో పంచాయతీ ఖాతాకు జమ చేయించారు. దానిపై సంతప్తి చెందని లోకాయుక్త విచారణ కొనసాగించాలననే నేపథ్యంలో జూన్ 14న లోకాయుక్తకు హాజరు కావాలని వెంకటరమణకు నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో అవినీతికి పాల్పడిన పంచాయితీ కార్యదర్శికి నోటీసులు అందజేస్తామని ఆయనకు తెలిపినట్లుగా వెంకటరమణ తెలిపారు.



రావణాపల్లి రిజర్వాయర్

ముగిసిన చేపల వేట

రిజర్వాయర్‌లో అడుగంటిన నీటి నిల్వలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో రావణాపల్లి రిజర్వాయర్లో శనివారంతో చేపల వేట ముగిసింది. ప్రతి ఏడాది మండలంలోని స్వదేశీ మత్స్యకార సొసైటీకి చెందిన 208 మంది సభ్యులు తమ భాగస్వామ్యంతో జూలై నెలలో రిజర్వాయర్లో చేప పిల్లలు వేసుకొని ఫిబ్రవరి నెల వరకు పెంచుకొని వాటిని వేట సాగించి ఆదాయం సంపాదించుకుంటారు. ఈ క్రమంలోని ఈ ఏడాది కూడా మార్చి, ఏప్రిల్ నెలలో మత్స్యకార సొసైటీ చైర్మన్ నక్క రమణ ఆధ్వర్యంలో చేపల వేట సాగించి మత్స్యకారులు ముగించారు. రిజర్వాయర్ లోని నీటి నిల్వలు అడుగంటడంతో చేప పిల్లలను పూర్తిస్థాయిలో తీసుకున్నారు.

ఘనంగా వాసవి మాత జయంతి

ప్రజాశక్తి - నక్కపల్లి: నక్కపల్లి లో ఆదివారం వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు, సభ్యులు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలో ఉదయం నగర సంకీర్తన చేసి, ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజయ్యపేటలో రాజయ్యపేటలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కక్కిరాల సురేష్, విశ్వేశ్వరరావు, నున్న గుప్తా, సత్తికొండ, వాసు, సందీప్, బాబ్జి పాల్గొన్నారు.



సిద్ధం చేస్తున్న సిబ్బంది

భూ హక్కు పత్రాలు సిద్ధం

ప్రజాశక్తి-కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రక్ష సర్వే కింద రైతులకు అందజేయనున్న భూ హక్కు పత్రాలు తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ మేరకు సర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించి సిబ్బంది పత్రాలను సిబ్బంది సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి విడత సర్వే పూర్తయిన అన్నవరం, ఎండపల్లి, సుంకపూరు, జల్లూరు, రాజుపేట, రామన్నపాలెం గ్రామాలకు సుమారు 1881 పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చినట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి. రాజుపేట గ్రామానికి భూ హక్కుపత్రాలు రావాల్సి ఉండగా ఐదు గ్రామాలకు 2916 ఖాతాలకు గాను 1881 పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. సుంకపూరుకు 593, రామన్నపాలెం 308, జల్లూరు 490, ఎండపల్లికు 478, వచ్చాయి. అన్నవరంకు 694 పాస్ పుస్తకాలకుగాను కేవలం 12 పుస్తకాలు మాత్రమే వచ్చినట్లు తెలిపారు.

పలుచోట్ల పూర్వ విద్యార్థుల కలయిక



హాజరైన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం అల్లూరి పార్కులో 23వ సంవత్సరం క్రితం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఆదివారం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థు లంతా పలకరించుకొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతిరెడ్డి రామకష్ణ, అంబటి వరహాల బాబు, గొంతిన తాతాజీ, గొంతిన నర్సింగరావు, ముచ్చకర్ల నర్సింగరావు, తోకల సంతోష్ కుమార్, దుంపలపూడి శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థి

ఎస్.రాయవరం: మన తోటి వారికి ఆపన్న హస్తం అందిద్దామని పూర్వ విద్యార్థులు పిలుపునిచ్చారు. కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-80 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. కొరుప్రోలు గ్రామానికి చెందిన కోరా రామారావు, పెదఉప్పలం గ్రామానికి చెందిన జయరావు, వైసిహెచ్ ప్రసాద్, యం కె యమ్ గుప్తాల నేతృత్వంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆనాడు తమను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాలకు తమవంతు అండగా నిలవడంతో పాటు తోటి వారికి ఆపన్నహస్తం అందిద్దామని నిర్ణయించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కష్టసుఖాలలో పాలు పంచుకోవాలని నిర్ణయించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు చెల్లూరి భాస్కరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు భీమరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మేడే సంబరాలు

విశాఖ నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఆదివారం తలపెట్టిన మేడే సాంస్కృతిక ఉత్సవాలు ఘనంగా సాగాయి. కళాకారుల ప్రదర్శనలకు చప్పట్ల వర్షం కురిసింది. 50కిపైగా ప్రదర్శనలతో 200 మందికిపైగా కళాకారులు ఆకట్టుకున్నారు. ప్రదర్శనలిచ్చిన వారిలో అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగం వరకూ ఉపాధ్యాయులతో సహా వివిధ రంగాలకు చెందిన కార్మికులంతా ఉండటం విశేషం. ఈ సాంస్కృతిక ఉత్సవాల్లో మహిళల కోలాటం, కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ప్రజాశక్తి - కలెక్టరేట్



నృత్యంతో ఆకట్టుకున్న కళాకారులు



అతిథులకు జ్ఞాపికలు అందజేస్తున్న నిర్వాహకులు



తప్పెటగుళ్లుతో ఉత్సాహం నింపిన కళాకారులు

ప్రతి అక్షరం ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక

Advt feature

మేడే ప్రత్యేక అనుబంధం

విశాఖ, అనకాపల్లి | సోమవారం 01-05-2023 | 12 పేజీలు



కార్మిక విజయానికి ప్రతీక.. మేడే

ప్రజాశక్తి- విశాఖపట్నం

కార్మికుల విజయానికి ప్రతీక మేడే. శ్రమజీవుల జయకేతనం సమున్నతంగా ఎగిరిన రోజు నేడే. అప్పటి సామ్రాజ్యవాదం మీద కార్మికవర్గం పోరాడి సాధించిన విజయానికి తీపి గురుతు ఈ రోజు. అమెరికా సామ్రాజ్యవాదానికి, జార్జి చక్రవర్తి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి హక్కులు సాధించిన అమరవీరులకు లాల్‌సలాం అంటూ ప్రపంచ వ్యాప్తంగా మేడేను కార్మికలోకం ఘనంగా జరుపుకోవడం రివాజు. ఈ నేపథ్యంలో మేడే విశిష్టతను, మన ముందున్న కర్తవ్యాలను తెలుసుకుందాం.

కనీస హక్కులు, ఎనిమిది గంటల పనిదినం, సమానపనికి సమాన వేతనం కోసం కార్మికవర్గం పోరాడి విజయం సాధించిన మధుర గురుతు మేడే. అటువంటి విజయానికి ప్రస్తుత పాలకులు తూట్లు పొడుస్తున్నారు. పని దినాన్ని 8 నుంచి 12 గంటలకు మార్చడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. చట్టాలను కుదించి నాలుగు కోడ్స్‌గా విభజించి అమలుకు యత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త హక్కులను సాధించుకోవడం మాటెలా ఉన్నా ఉన్న హక్కులను కాపాడుకోవాలంటే కార్మికలోకం సంఘటితంగా పోరాడాలి. సరైన వేతనం కోసం, సాంఘిక సంక్షేమ కోసం, కార్మిక హక్కుల పరిరక్షణ, (మిగతా 4లో..)

మేడే పోరాట స్ఫూర్తితో..

కార్మిక హక్కులను కాపాడుకుందాం



ప్రపంచ కార్మిక దినోత్సవం "మే డే" కార్మిక హక్కుల దీక్షా దినం స్ఫూర్తితో కార్మిక వర్గంపై జరుగుతున్న దాడులను ఎదుర్కొందాం. గత 137సంవత్సరాల క్రితం 8గంటల పని దినం కోసం పోరాడి విజయం సాధించిన దినం "మే డే. నాటి పోరాట స్ఫూర్తితో భారత కార్మిక వర్గం అనేక చట్టాలను, హక్కులను సాధించుకుంది. కానీ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలు తరువాత (1991) కార్మిక వర్గంపై రోజు రోజుకు భారాలు పెరుగుతున్నాయి. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4లేబర్ కోడ్స్ తీసుకు వచ్చింది. ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికవర్గం ఇప్పటి వరకు అనుభవిస్తున్న అనేక హక్కులను కోల్పోవలసి వస్తుంది.

ఉదాహరణకు :సంఘం పెట్టుకొనే హక్కు, సమ్మె చేసే హక్కు, జీత భత్యాల బేరం ఆడే హక్కు మొదలగునవి. అందుకే యాజమాన్యాలకు లాభాలు చేకూర్చి కార్మికులను మరింత బానిసలుగా మార్చే 4లేబర్ కోడ్స్ రద్దుకు కార్మిక వర్గం పెద్దఎత్తున పోరాడాలి.

కాదేది ప్రైవేటీకరణకు అనర్హం అన్నట్లు మోడీ ప్రభుత్వం నేడు పోర్టులు, వినానాశ్రయాలు, ఎల్ఐసి, బ్యాంకులు, చమురు సంస్థలు, రోడ్లు, గనులు, అంతరిక్షం ఇలా అన్నింటిని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కట్ట బెడుతుంది. దీనిలో భాగంగానే 32మంది ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న "విశాఖ ఉక్కు" ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేయాలని పూనుకుంది. గత 800 రోజులు పైబడి కార్మిక వర్గం ఐక్యంగా "విశాఖ ఉక్కు" రక్షణకు పోరాడుతోంది. స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ ప్రభుత్వం "ప్రభుత్వరంగ పరిశ్రమలు- ఆధునిక దేవాలయాలు" అంటే నేడు మోడీ ప్రభుత్వం "ప్రభుత్వరంగ పరిశ్రమలు- చావడానికే పుట్టాయి." అంటున్నారు. మోడీ ప్రభుత్వం ఈ దేశంలో కార్మిక వర్గానికే కాదు మొత్తం దేశ సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గం, రైతాంగం, వ్యవసాయ కార్మికులపై తన దాడిని ఎక్కు పెట్టింది. రైతాంగాన్ని నష్టం చేసే 4 నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఆగ్రహానికి గురైంది. స్వయంగా మోడీ ఆ చట్టాలను రద్దు చేస్తామని రైతులకు క్షమాపణ చెప్పి ఇప్పుడు మళ్ళీ దొడ్డి దారిన ఆ చట్టాలు అమలుకు పూనుకుంటున్నారు.

సంపదలను సృష్టిస్తున్న కార్మిక వర్గానికి కనీస వేతనం నెలకు రూ.26,000 తక్కువ లేకుండా చెల్లించాలని డిమాండ్ చేస్తుంటే ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టడం, లక్షలాదిగా ఖాళీగా వున్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా ఫిక్స్‌డ్ టెర్మ ఎంప్లాయిమెంట్ పేరుతో నిర్ణీత కాల పరిమితితో ఉద్యోగులను నియమిస్తుంది. అసంఘటిత రంగంలో పని చేస్తున్న ఆటో, భవన నిర్మాణం, ముఠా, తోపుడు బండ్లు వంటి వారికి ఏ విధమైన రక్షణ చట్టాలు లేవు. షాపులు, హాస్పిటల్స్, హోటల్స్, పెట్రోల్ బంక్స్ వంటి రంగాల్లో సంవత్సరాల తరబడి కనీస వేతనాల జివోలు సవరించ లేదు.

శ్రామిక మహిళలకు అతి తక్కువ వేతనాలు చెల్లించి వారి శ్రమను దోచుకుంటుంది. వివిధ ప్రభుత్వ స్కీమ్‌ల్లో పని చేస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, విఓఎ వంటి వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం లేదు. వీరికి కనీస వేతనాలు అమలు చేయడం లేదు. గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు.

అందుకే ఈ "మే డే" కార్మిక హక్కుల దీక్ష దినం స్ఫూర్తితో కార్మిక హక్కుల పరిరక్షణకు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలు ప్రైవేట్‌పరం చేయరాదని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలి. పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలం. **కార్మిక ఐక్యత వర్ధిల్లాలి - "మేడే" వర్ధిల్లాలి**

- ఆర్‌కెఎస్‌వి.కుమార్,
సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి



విశాఖలో సాగుతున్న కార్మిక సంఘాల ర్యాలీ (ఫైల్ ఫోటో)

వ్యవస్థీకృత రంగం ఉద్యోగులకు ఇఎస్ఐతో సామాజిక, ఆర్థిక రక్షణ



మల్కాపురంలోని ఇఎస్ఐ ఆసుపత్రి

ప్రజాశక్తి-విశాఖపట్నం

వ్యవస్థీకృత రంగంలోని ఉద్యోగులకు సామాజిక-ఆర్థిక రక్షణను అందించే సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ స్కీమ్ ఆఫ్ ఇండియా (ఇఎస్ఐసి). ఉద్యోగులకు అనారోగ్యం, ప్రసూతి, వైకల్యం, పనిచేసే సమయంలో జరిగిన ప్రమాదాల కారణంగా ఏర్పడే గాయాలు, మరణం వంటి వాటి నుంచి రక్షణ (ఆర్థిక) కల్పిస్తుంది. అలాగే ఉద్యోగులతోపాటు వారి కుటుంబాలకు ఉచిత వైద్య సంరక్షణను అందిస్తుంది.

ఎవరు అర్హులు?

పది లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు, కర్మాగారాలు, షాపులు, ఆఫీసుల్లో పనిచేస్తూ నెలకు రూ.21 వేలు అంతకంటే తక్కువ వేతనంలో ఉన్న వారికి ఈ పథకం వర్తిస్తుంది. అర్హులైన ఉద్యోగులను ఇఎస్ఐసి పథకం కింద నమోదు చేయడం సంస్థ యజమాని బాధ్యత. ఈ పథకంలో ఉద్యోగి వేతనంలో యజమాని 3.25 శాతం, ఉద్యోగి రూ.0.75 శాతానికి సమానమైన మొత్తాన్ని చందా కింద జమచేస్తారు. ఉద్యోగులతోపాటు వారి కుటుంబ సభ్యులకు వైద్య సంరక్షణ అందుతుంది. చికిత్సకు అయ్యే ఖర్చుపై పరిమితి లేదు.

యజమాని బాధ్యతే..

నెలకు రూ.21 వేల లోపు జీతం ఉన్న ఉద్యోగులను ఇఎస్ఐలో రిజిస్టర్ చేయడం సంస్థ యజమాని బాధ్యత. ఉద్యోగి, పైన తెలిపిన వేతన పరిధిలో ఉన్నంత కాలం ఇఎస్ఐ పరిధిలో ఉంటారు. ఉద్యోగం మారినా దాని ప్రభావం బీమాపై పడదు. ఇఎస్ఐ వర్తించనంతకాలం బీమా సంఖ్య కూడా మారదు.

ఇఎస్ఐ పథకం ప్రయోజనాలు...

మెడికల్ బెనిఫిట్ : ఇఎస్ఐ పరిధిలోకి వచ్చే వ్యక్తి ఉపాధిని పొందిన నాటి నుంచి అతడు/ ఆమెతోపాటు కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య సంరక్షణ అందుతుంది. కాంట్రీబ్యూషన్‌తో సంబంధం లేకుండా అందరికీ ఒకేరకమైన వైద్య సాయం అందుతుంది. చికిత్సకు అయ్యే ఖర్చుపై గరిష్ట పరిమితిలేదు. ఉద్యోగ విరమణ పొందిన వారు, శాశ్వత వికలాంగులకు, వారి జీవిత భాగస్వాములకు కూడా టోకెన్ వార్షిక ప్రీమియం రూ.120 చెల్లింపుపై వైద్య సంరక్షణ అందిస్తారు.

సిక్‌నెస్ బెనిఫిట్ : ధ్రువీకరించిన కొన్ని అనారోగ్యాలతో బాధపడుతున్న సమయంలో సిక్ లీవ్ తీసుకోవచ్చు. ఏడాదిలో 91 రోజుల పాటు ఈ సెలవులు తీసుకునే అవకాశముంది. అనారోగ్య కాలంలో సిక్‌నెస్ బెనిఫిట్ కింద నగదు రూపంలో పరహారం ఇస్తారు. కార్మికుడి జీతంలో 70 శాతం ఈ పరిహారం ఉంటుంది. ఈ ప్రజయోజనం కోసం ఆరు నెలల కాలంలో 78 రోజులు తప్పనిసరి కాంట్రిబ్యూట్ చేయాల్సి ఉంటుంది.

మెటర్నిటీ బెనిఫిట్ : గర్భదారణ సమయంలో 26 వారాల పాటు మెటర్నిటీ బెనిఫిట్ అందిస్తారు. వైద్యుడి సలహాపై మరొక నెల పాటు పొడిగించుకోవచ్చు. పూర్తి జీతం చెల్లిస్తారు.

తాత్కాలిక వైకల్యం : ఉద్యోగంలో ఉన్నప్పుడు గాయపడితే కాంట్రీబ్యూషన్లతో సంబంధంలో లేకుండా.. గాయపడిన నాటి నుంచి అంగవైకల్యం కొనసాగినంతకాలం వేతనంలో 90 శాతం చొప్పున ప్రయోజనాన్ని చెల్లిస్తారు.

శాశ్వత అంగవైకల్యం : మెడికల్ బోర్డు ధ్రువీకరణపై ప్రమాదం కారణంగా సంపాదన సామర్థ్యాన్ని కోల్పోయిన స్థాయిని బట్టి, నెలవారీగా చెల్లించే వేతనంలో 90 శాతం చొప్పున ప్రయోజనాన్ని చెల్లిస్తారు.

డిపెండెంట్ బెనిఫిట్ : ఉద్యోగంలో గాయం లేదా వృత్తిపరమైన ప్రమాదం కారణంగా మరణం సంభవిస్తే, ఉద్యోగిపై ఆధారపడిన వారికి అంతడి నెలవారీ వేతనంలో 90 శాతం మొత్తాన్ని చెల్లిస్తారు.

ఇతర ప్రయోజనాలు :

ఉద్యోగి మరణిస్తే అతడి అంతిమ కర్మల కోసం తనపై ఆధారపడిన వారికి రూ.15 వేలు చెల్లిస్తారు.

ఇఎస్ఐ ఉన్న మహిళ లేదా ఇఎస్ఐ సభ్యుడి భార్య ఇఎస్ఐ పథకం కింద తగిన వైద్య సేవలు అందుబాటులో లేని ప్రదేశంలో ఉంటే కన్‌ఫైన్‌మెంట్ ప్రయోజనాన్ని అందజేస్తారు.



ఇఎస్ఐ సభ్యత్వం పొందిన ఉద్యోగులకు ఇచ్చే గుర్తింపు కార్డు

8 గంటల పని దినం, కార్మిక హక్కుల సాధనకై

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సన్నద్ధం

జి.కోటేశ్వరరావు,
సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేకు 2023 సంవత్సరంలో ప్రత్యేకత ఉంది. కార్మిక వర్గం తమ హక్కుల సాధనకై పిడికిలి బిగించి నినదించి ఈ మేడేతో వందేళ్లు పూర్తవుతుంది. ఈ మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం తమపై దాడిని ఎదుర్కొనేందుకు మరిన్ని పోరాటాలకు సమాయత్తం అవుతోంది. కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం మేడే పైనా దాడి చేస్తోంది. 8 గంటల పని దినం నుండి 12 గంటలకు పెంచుతూ బిల్లును ఆమోదించింది. వారానికి ఆరు రోజుల పనిలో.. రోజుకు 8 గంటల చొప్పున ఆరు రోజుల్లో 48 గంటలకు బదులు, వారానికి నాలుగు రోజులు.. రోజుకు 12 గంటలు పని చేయించే వెసులుబాటును ఫ్యాక్టరీ యజమానులకు కల్పించింది. నాలుగు రోజులు పని చేస్తే మిగతా మూడు రోజులు కార్మికులు చక్కగా కుటుంబాలతో గడుపుతూ విశ్రాంతి తీసుకోవచ్చని బిజెపి ప్రభుత్వం వాదిస్తోంది. విదేశీ, దేశీయ కార్పొరేట్ శక్తులు పని వేళల్లో, పని దినాల్లో మార్పులు కోరుకుంటున్నాయని, వారికి అనుకూలంగా చట్టాలు చేస్తే పెట్టుబడులు, ఉద్యోగాలు వరదలా వచ్చి పొంగి పొర్లుతాయని చెబుతూ కార్మిక చట్టాలను, హక్కులను బిజెపి ప్రభుత్వం కాలరాస్తోంది. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను యజమానులకు కట్టుబానిసలుగా చేసేందుకు దూకుడుగా పావులు కదుపుతోంది. 12 గంటలు పనికి మించి ప్రైవేటు, బహుళజాతి కంపెనీల్లో కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయిస్తూ యాజమాన్యాలు దర్జాగా శ్రమ దోపిడీ చేస్తున్నాయి. కాంట్రాక్టు కార్మికుల పేరుతో సాగుతున్న దోపిడీకి హద్దే లేకుండా పోతోంది.

జిల్లాలో కార్మికుల ప్రాణాలకు, ఉపాధికి భద్రత కరువు

అనకాపల్లి జిల్లాలో ఫార్మా రంగంలో 60 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. డ్యూటీకి వెళ్లిన కార్మికుడు ఇంటికి తిరిగి వస్తాడనే గ్యారెంటీ లేదు. అర చేతిలో ప్రాణాలు పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ పని చేయాల్సిన దుస్థితి ఉంది. ప్రతి నెలా రెండు మూడు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత ఐదేళ్లలో 48 మంది కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోగా, మరో 74 మంది క్షతగాత్రులయ్యారు. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలపై పెట్టే ఖర్చు కంటే చనిపోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించడమే తమకు లాభమన్నట్లు యాజమాన్యాలు వ్యవహరించం దుర్మార్గమైన చర్య. తమ లాభాలే పరమావధిగా భావిస్తూ భద్రతను గాలికి వదిలేస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన ఒక్క చర్యా తీసుకోలేదు. ఇక కార్మికుడి ఉద్యోగ భద్రత ఊసే ఎత్తడానికి వీలులేకుండా కార్మికుల గొంతులను నులిమేస్తున్నాయి. ఈ పరిశ్రమల్లో కార్మిక చట్టాలు, హక్కులు ఊసే ఎత్తకూడదు. సమ్మెలు చేయకూడదు. యూనియన్ పెట్టుకోకూడదు. జీతాలు పెంచాలని అడగకూడదు. అదేమని అడిగితే ఉద్యోగాల నుంచి తొలగించి ఇంటికి పంపిస్తున్నారు. అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోనూ ఇదే పరిస్థితి.

కార్మికవర్గం యజమానుల దయా దాక్షిణ్యాలపై పని చేయాల్సిన దుస్థితిలో ఉంది. అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో బ్రాండిక్స్‌లో రెండు సార్లు విష వాయువులు విడుదలై మహిళా కార్మికులు పిట్టల్లా స్పృహ తప్పి కుప్పకూలిపోయారు. 410 మందికి ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున చెల్లించాలని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినా బ్రాండిక్స్ యాజమాన్యం నేటికీ ఒక్కపైసా కూడా కార్మికులకు చెల్లించకపోవడమే దీనికి ఉదాహరణ. మరో వైపు పరిశ్రమల చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కుకొని రోగాల బారిన పడుతున్నారు. పరవాడ ఫార్మా సిటీకి కూతవేటు దూరంలో ఉన్న తాడి గ్రామాన్ని తరలిస్తామని స్వయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పినా నేటికీ అది అమలుకు నోచుకోక ప్రజలు విషాన్ని పీలుస్తూ అనేక రోగాల బారిన పడుతూ జీవచ్ఛంలా బతుకీడుస్తున్నారు.

కనీస వేతనం అమలేదీ ?

అనకాపల్లి జిల్లాలో పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతుంది. అదే సందర్భంలో అచ్యుతాపురం ఎస్ఇజెడ్, పరవాడ ఫార్మాసిటీలో కార్మికుల నిజవేతనాల్లో ఆ స్థాయిలో పురోగతిలేదు. కనీస వేతనాలు అమలు కావడం లేదు. మరోవైపు పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలన్న జిఓను అమలు చేయకుండా, తక్కువ వేతనాలతో పనిచేయించుకొనేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకొని పనిచేయించుకుంటున్నారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ జరగడం లేదు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అమలు చేస్తున్నదీ, లేనిదీ పరిశీలించి, లోపాలను సరిచేయించే పరిశ్రమశాఖాధికారుల తనిఖీ వ్యవస్థ బలంగాలేదు. ప్రభుత్వాలు నిస్సిగ్గుగా యాజమాన్యాలకు కొమ్ముకాస్తున్నాయి. ప్రభుత్వ అండచూసుకొని యాజమాన్యాలు కార్మికుల కనీస హక్కులను, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదు. 12 గంటలు పనిచేయించుకుంటున్నాయి. జీడిపక్కలు, ఇటుక బట్టీలు, హేచరీస్, క్వారీలు, ఆక్వా, సిమెంటు, డిస్టలరీస్ వంటి షెడ్యూల్ పరిశ్రమల్లో కార్మికుల కనీసవేతనాలు సవరించి 14 ఏళ్లవుతున్నా అమలు చేయడం లేదు. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నా.. రోజు వేతనం రూ.150, రూ.200కు మించి ఇవ్వడంలేదు.

ప్రభుత్వ విధానాలు సంఘటిత, అసంఘటితరంగ కార్మికుల బతుకులను దెబ్బతీస్తున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా అందాల్సిన పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదు. కార్మికులకు బకాయిలు ఇవ్వడం లేదు. పెంచుతున్న పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకుతోడు, విచ్చలవిడిగా లైసెన్స్ ఫీజులు పెంచడం, అపరాద రుసుం విధించడంతో ఆటో, మోటార్ ట్రాన్స్‌పోర్టు కార్మికుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రయివేటు స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పరిస్థితి మరీ దయనీయంగావుంది. ఆస్పత్రులు, షాపులు, హోటళ్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న కార్మికులకు 10 వేల రూపాయలు చెల్లించడంలేదు. కనీస వేతనాలు అమలు జరిగేలా చూడాల్సిన కార్మికశాఖ కపటనిద్ర ప్రదర్శిస్తోంది. కార్మికులు, ఉద్యోగులు సిఐటియు నాయకత్వాన సమరశీల పోరాటాలు నిర్వహించిన చోట వేతనాలు పెంచుకున్నారు.

ప్రభుత్వ పథకాలు, స్కీమ్‌లలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మిడ్డేమీల్, ఐకెపిలో పనిచేస్తున్న వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీసవేతనం 26వేలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ సదుపాయాలు కల్పించాలన్న న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. విఆర్ఎ, పంచాయితీ, మున్సిపల్, సర్వశిక్ష అభియాన్, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేయడంలేదు. కనీసం టైం స్కేల్ వర్తింపజేయడంలేదు.

కార్మిక చట్టాల అమలుకు మేడే స్ఫూర్తితో కార్మికవర్గం పోరాడాలి. 'సంఘం పెడదాం - సంఘటితమవుదాం' అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలి.

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఫెసిలిటేటర్ పాత్ర



అచ్యుతాపురం, విశాఖలో ఐటి కార్మికుల నుంచి పలు ఫిర్యాదులు
అన్నిటిపైనా స్పందిస్తున్నాం
ఉత్తరాంధ్రలో అత్యధిక మంది భవన నిర్మాణ కార్మికులే..
కార్మికులకు వైఎస్ఆర్ బీమా అమలు చేస్తున్నాం
- 'ప్రజాశక్తి'తో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.రామారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సరళతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) కోసం అటు యాజమాన్యాలు, ఇటు కార్మికులకు మధ్య ఒక సమన్వయకర్త, స్పాన్సర్ (ఫెసిలిటేటర్) పాత్రను లేబర్ డిపార్టుమెంట్ పోషిస్తోందని విశాఖపట్నం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) ఎం.రామారావు వెల్లడించారు. మేడే సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. మారిన లేబర్ నిబంధనల నేపథ్యంలో తనిఖీలు, ఫ్యాక్టరీలకు పర్యటనలపై పెద్దగా దృష్టిలేదన్నారు. యాజమాన్యాలు తమ వ్యాపారావసరాలకు తగ్గట్టుగా తమ పాత్ర 'ఫెసిలిటేటర్'గా మారిందని జెసిఎల్ వెల్లడించారు. తగరపువలస జ్యూట్ మిల్లు 2009లో యాజమాన్యం మూసేసిన తర్వాత 6వేల మంది కార్మికుల విషయంలో నష్టపరిహారం రూ.43 కోట్లకుగానూ రూ.39 కోట్లు (ఒన్ టైం సెటిల్‌మెంట్) కింద చెల్లించామని ఇంకా 125 మందికి చెల్లించాల్సి ఉందని తెలిపారు. జిల్లా న్యాయసేవా సదన్ (డిఎల్ఎస్ఎ)ను ఈ ఏడాది మేడేకు ఆహ్వానించామన్నారు. ఉత్తమ యాజమాన్యం, కార్మికులను ఈ సందర్భంగా అభినందిస్తామన్నారు.

కొత్త కార్మిక చట్టాల అమలు ఎలా ఉంది ?

కార్మిక చట్టాల సరళతరం 2015 నుంచి పూర్తిస్థాయిలో అమలవుతోంది. ఏ సమస్య తలెత్తినా కేంద్ర చట్టాలు 25, రాష్ట్ర చట్టాలు 4 అమలు చేస్తున్నాం. ఇఒడిబి అమలైన నాటి నుంచీ తనిఖీలు నిలుపుదల చేశాం. కార్మిక శాఖ లక్ష్యం అన్ని తరగతులూ, రంగాల్లో పనిచేసే కార్మికులను వారి పేదరికం సమస్యల నుంచి అధిగమించే ఏర్పాట్లు చేయడమే. మహిళలు, బాల కార్మికులు, వివిధ రంగాలు, వృత్తుల్లోనూ, షాపుల్లోనూ, సినిమా హాల్స్ షాపింగ్ మాల్స్‌లోనూ, ఐటి కంపెనీలు, ప్రమాదకరమైన పరిశ్రమల్లో ఇలా ఎక్కడ పనిచేసినా కార్మికుల సంక్షేమాన్ని చూడడమే లేబర్ డిపార్టుమెంట్ విధి. భారత



రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా అణగారిన ప్రజలకు చేసిన చట్టాలను అమలు చేసి వారి కష్టాల నుంచి వైదొలగించాలి.

విశాఖ నగరంలో సాఫ్ట్ వేర్ కంపెనీలకు నోటీసుల వివరాలు వెల్లడిస్తారా ?

సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ 20 ఐటి కంపెనీల నుంచి ఉద్యోగస్తులు ఫిర్యాదులు చేశారు. ఐటి సంస్థలో చేరినప్పుడు సర్టిఫికెట్లు వారి నుంచి కంపెనీలు తీసుకున్నాయి. వీరికి మంచి ఆఫర్‌లు వచ్చినప్పుడు బయటకు వెళ్లాల్సి వస్తే యాజమాన్యాలు వెళ్లకుండా అడ్డుకోవడమో లేదంటే బెనిఫిట్స్ ఇవ్వకుండా, సర్టిఫికెట్లను కూడా తిరిగి ఇవ్వకుండా చేశాయి. 10 నుంచి 15 మంది ఉద్యోగులు ఇలా పలు సంస్థలపై ఫిర్యాదులు చేశారు. వారికి నోటీసులు ఇచ్చాం. చర్యలు తీసుకుంటాం.

అచ్యుతాపురం సెజ్‌లోంచి చాలా మంది కార్మికులు తమను అన్యాయంగా యాజమాన్యం తీసేస్తుందంటూ ఫిర్యాదులు చేశారు. ఇతర కంపెనీల నుంచి ఫిర్యాదులు ఉన్నాయి. కనీసం బెనిఫిట్స్ ఇవ్వకుండా అడిగితే పనిలోంచి తీసేసిన ఉదంతాలూ ఉన్నాయి. బోనస్, గ్రాట్యుటీ ఇవ్వడం లేదంటూ ఫిర్యాదులున్నాయి. యాజమాన్యాలతో చర్చలు జరుపుతున్నాం. పరిష్కారానికి కృషిచేస్తాం.

ఉత్తరాంధ్రలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి ఎలా ఉంది ?

ఉత్తరాంధ్ర జిల్లాల్లో జనాభా 50లక్షల మందిలో 30 లక్షల మందికి పైగా అసంఘటిత రంగంలోనే జీవనం సాగిస్తున్నారు. భవన నిర్మాణం, మత్స్యకారులు, గిరిజనులు, హోటల్స్, నిర్మాణ రంగం వంటి పనుల్లో ఉన్నారు. చెప్పుకోదగ్గ పరిశ్రమలు, ఉపాధి కల్పించే సంస్థలు లేనందున వీటినే ఎంచుకుంటున్నారు. మత్స్యకారులు చేపల వేటపై వేల కుటుంబాలు ఆధారపడుతున్నాయి. గిరిజనులు కొండలపై జీవనం సాగిస్తూ కూలీ పనుల్లో నిమగ్నం అవుతున్నారు. వీరందరికీ చట్టాలు వర్తిస్తాయి.

పరిశ్రమల ఉల్లంఘనలు ఏమైనా ఉన్నాయా?

అనేక సంస్థలు సెస్ కట్టడం లేదు. విజిలెన్స్ అధికారులు గుర్తించి లేబర్ డిపార్టుమెంట్‌ను సంప్రదించారు. రామ్ కో సిమెంట్ (విశాఖపట్నం) రూ.37లక్షలు సెస్ ఎగ్గొట్టింది. ప్రతి సంస్థ తమ నిర్మాణ వ్యయంలో 1శాతం సెస్ చెల్లించాలి. విశాఖలో 800 కంపెనీలు, విజయనగరం జిల్లాలో 1659, శ్రీకాకుళంలో 169 సంస్థలు, పరిశ్రమలు సెస్ ఎగ్గొట్టాయి. 2014 నుంచి రూ.150కోట్లు రావాల్సి ఉంది. నోటీసులు ఇస్తున్నాం. ఎసిఎల్, డిసిఎల్, లేబర్ అధికారులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు.

వైఎస్ఆర్ బీమా అమలు ఎలా ఉంది?

విశాఖ జిల్లాలో 800 మంది కార్మికులు మృతిచెందారు. వీరందరికీ వైఎస్ఆర్ బీమా వర్తిస్తోంది. సహజ మరణాలకు రూ.లక్ష, ప్రమాదంలో మరణిస్తే రూ.5లక్షలు ఇవ్వాలన్నది వైఎస్ఆర్ బీమా పథకం చెబుతోంది. పైన తెలిపిన వివరాల్లో 111 మంది ప్రమాదంలో మరణించారు. వీరిలో 57 మందికి బీమా ఇప్పటివరకూ ఇచ్చాం. సహజ మరణాలు 814 మంది కాగా ఇప్పటివరకూ 416 మందికి బీమా క్లెయిమ్ చెల్లింపులు జరిగాయి. కల్యాణ బీమా పథకం ఒకటి భవన నిర్మాణ కార్మిక కుటుంబంలో ఎవరైనా వివాహం చేసుకుంటే వర్తిస్తోంది.

కార్మిక విజయానికి ప్రతీక.. మేడే

(మొదటి పేజీ తరువాయి..) ఉపాధి, సామాజిక న్యాయం కోసం, మెరుగైన జీవన విధానం కోసం మేడే స్ఫూర్తితో కార్మికవర్గం పోరుబాటకు సిద్ధం కావటమే తక్షణ కర్తవ్యం.

ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రయివేటీకరణ పేరుతో నయా సామ్రాజ్యవాద శక్తులు కార్మికలోకానికి సరికొత్త సవాళ్లు విసురుతున్నాయి. సుమారు 137 ఏళ్ల క్రితం కార్మిక లోకం త్యాగఫలితంగా సాధించుకున్న హక్కులకు తీవ్ర భంగం వాటిల్లుతోంది. ప్రభుత్వాలు ఒకటొకటిగా హక్కులను హరించివేస్తున్నాయి. ప్రపంచంలోని అన్ని దేశాలూ కార్మికుల మీద ముప్పేట దాడులను ఎక్కుపెడుతున్నాయి. ఎస్ఇజెడ్‌ల పేరిట బానిసత్వ పనిదినానికి నాంది పలుకు తున్నాయి. నాటి 16 గంటల, 12 గంటలు పని దినానికి వ్యతిరేకంగా పోరుటాన్నెక్కిపెట్టి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినాన్ని తిరిగి 12 గంటలకు మార్చేందుకు ఇప్పటికే కుట్ర జరిగింది. కార్మిక చట్టాలను యాజమాన్యాల ప్రయోజనాల కనుగుణంగా సవరిస్తున్నారు. సంఘటిత శక్తిగా ఉంటే కార్మికలోకాన్ని ఎదుర్కొనలేమని భావించి అసంఘటిత రంగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రయివేటు సంస్థల్లో కూడా కాంట్రాక్టీకరణ, అవుట్ సోర్సింగ్ పెరుగుతోంది. ప్రభుత్వరంగ సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగ నియామకాలకు ఎప్పుడో తిలోదకాలిచ్చేశారు. ఉద్యోగ విరమణ జరిగిన ఖాళీలకు భర్తీ చేయడం లేదు. కారుణ్య నియామకాల ఊసు ఎత్తకపోవడంతో మరణించిన ఉద్యోగుల కుటుంబాలు వీధినపడుతున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగాలకు తిలోదకాలిస్తున్నారు. దీంతో అసంఘటితరంగ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఉదారవాద విధానాల వల్ల దేశంలో 50 లక్షలకుపైగా సంఘటిత రంగంలో ఉద్యోగాలు రద్దయిపోయాయి. ప్రస్తుతం దేశంలో 94.7 శాతం మంది అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, పని గంటలు లేవు. బోనస్, పిఎఫ్, ఇఎస్ఐ వంటి



కనీస సదుపాయాలు అమలు కావడం లేదు. సమానపనికి సమాన వేతనాలు లభించడం లేదు. వేతనాల మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. కూర్చొని అజమాయిషీ చెలాయించేవారికి వేలల్లో, లక్షల్లో వేతనాలు లభిస్తే, రక్తాన్ని చెమటగా మార్చి సంపదను సృష్టిస్తున్నవారికి అర్ధాకలి బతుకే గతవుతోంది. చాలీచాలని వేతనాలతో దుర్భరజీవనం గడుపుతున్న అసంఘటిత కార్మికులను ఆదుకోవడానికి ప్రభుత్వాలు ఎటువంటి సంక్షేమ చర్యలూ చేపట్టడం లేదు. కనీస హక్కుల కోసం, వేతనాల కోసం ఉద్యమిస్తున్న వారిపై ప్రభుత్వం దారుణమైన అణచివేతకు పాల్పడుతోంది. కార్మికుల హక్కులను కాపాడటం కోసం ఏర్పాటు చేసిన లేబరు డిపార్టుమెంట్‌ను (మిగతా 12లో..)

వెండితెరపై కార్మిక జెండా..!

ప్రజాశక్తి - కలెక్టరేట్

జలశక్తి.. విద్యుత్ శక్తిగా మారితే మన జీవితాలను వెలిగిస్తుంది. సృజనశక్తి.. శ్రామిక శక్తితో కలిస్తేనే వెండితెరపై రంగుల చిత్రం వెలుస్తుంది. థియేటర్లో మనల్ని ఆనందపరచడానికి వేల మంది సినీ కార్మికులు నిత్యం స్వేదంతో సావాసం చేస్తూనే ఉంటారు. సెట్ బాయ్ నుంచి.. కెమెరా ఆపరేటర్ దాకా, డ్రైవర్ల నుంచి ట్రాలీ కార్మికుల దాకా.. అంతా ఒక్కటై దర్శకుని కలను.. కళగా మార్చడానికి ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి శ్రమైక జీవులెందరో అలుపెరగని పోరాటంతో తమ హక్కులు సాధించుకున్న సుదినమే మేడే. సమాజ నిర్మాణంలో కీలకమైన ఈ కార్మికుల కథాంశంతో ఎన్నో తెలుగు చిత్రాలు వచ్చాయి. కథానాయకులు కార్మికుల పాత్రల్లో స్వేదం చిందించారు. వీరి పాత్రలకు తగ్గట్టు పాటల రచయితలు వాళ్ల తరుపున కలం ఎత్తితే.. గాయకులు బలంగా గళం వినిపించారు. ఇటువంటి కొన్ని పాటల్ని ఈ కార్మిక దినోత్సవాన గుర్తు చేసుకుందాం.

నందమూరి తారక రామారావు బ్లాక్ అండ్ వైట్ రోజుల్లోనే కార్మిక జెండా అందుకున్నారు. 'శెభాష్ రాముడు'లో ఘంటసాల గళంతో 'జయమ్ము నిశ్చయమ్మురా.. జంకు గొంకు లేక నువ్వు సాగిపొమ్మురా' అంటూ కార్మికుల పక్షాన కదం తొక్కారు. అందులో ఆయన రిక్షా కార్మికునిగా కనిపించారు.

'అన్యాయం.. అక్రమాలు.. దోపిడీలు.. దురంతాలు.. ఎన్నాళ్లని, ఎన్నేళ్లని నిలదీసినదీ రోజే మేడే' అంటూ కార్మిక దినోత్సవానికి సిసలైన అర్థం చెబుతూ సాగుతుంది 'ఎర్రమల్లెలు' చిత్రంలో పాట. కార్మిక నాయకునిగా, పీడితుల పక్షాన పోరాడే వ్యక్తిగా.. మురళీ మోహన్ ఇందులో నటించి మెప్పించారు.

ప్రస్తుతం మాస్ కథాంశంతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న బాలయ్య అప్పట్లో సింగరేణి కార్మికునిగా నటించారు. 'రండి కదలి రండి.. నిదురలెండి.. కలిసి రండి..' అంటూ కణకణలాడే నిప్పు కణికలా 'నిప్పురవ్వ'లో నటించారు.

భూమికీ పచ్చాని రంగేసినట్టే ఓయమ్మాలాలో.. అన్న పాట ప్రతి కార్మిక దినోత్సవాన శ్రమను నమ్ముకున్న ప్రతి ఒక్కరి గుండె తడుతూనే ఉంటుంది. కెజె.ఏసుదాస్ గళం నుంచి జాలువారిన ఈ గీతం కర్షకుల కష్టం గురించి చెబుతూనే సాగుతుంది. శ్రీరాములయ్య చిత్రంలోని ఈ పాట ఎందరినో అలరించింది.

మేడే అంటే సినీ ప్రియులకు వెంటనే గుర్తొస్తే పేరు పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి. ఆయన పాట, పాత్ర, ఎప్పుడూ పీడితుల పక్షమే. శ్రమ జీవుల హక్కుల కోసమే నారాయణమూర్తి పాత్రకు వందేమాతరం శ్రీనివాస్ గళం తోడై కదం తొక్కిన పాటలెన్నో. 'ఎర్ర సైన్యం'లో బంజారే బంజో.. వానోరే బంజా..', ఒరేయ్ రిక్షాలో 'నా రక్తంతో నడుపుతాను రిక్షాను', చీమలదండులో ఎర్రజెండ ఎర్రజెండ ఎన్నీయాళ్లో.. ఎర్రెర్రనిదీ జెండెన్నీయల్లో' అప్పట్లో జనాన్ని ఉర్రూతలూగించాయి. సింగన్న చిత్రంలో .. 'ఆయారే మేడే.. ఆయుధమై నేడే'.. అంటూ హోరెత్తిన పాటలు బూర్జువా, పెట్టుబడిదారి, భూస్వాముల గుండెల్లో మర ఫిరంగుల్లా పేలాయి.





కునారిల్లిపోతున్న పల్లె వృత్తుల వెతలను కళ్లకు కట్టేలా గోరటి వెంకన్న అల్లిన పాట 'పల్లె కన్నీరు పెడుతుందో'. కుబుసం సినిమాలో శ్రీహరి తన ఈ పాట, పాత్రకు ఎర్రదనం అద్దాడు. ఇలా ఎన్నో గీతాలు కార్మికుల జీవితాన్ని, పోరాటాన్ని వెండితెరపై ఆవిష్కరించాయి.

శ్రమైక సినీ సౌందర్యం

తెరపై హీరో, హీరోయిన్ తళుకు బెళుకులు మాత్రమే కనిపించొచ్చు. సినిమా విడుదలయ్యాక ఒకరిద్దరికే గుర్తింపు రావొచ్చు. లాభనష్టాలు పంచుకునేది కొద్దిమందే కావొచ్చు. కానీ కష్టం అందరిదీ !. 24 కళలు కలిసి సమిష్టిగా శ్రమిస్తేనే సినిమా ప్రేక్షకుల ముందుకొస్తుంది. లైట్ బాయ్ సెట్లో లైటెత్తితేనే సినీ సీమకి వెలుగు. కెమెరా క్రేన్ ముందుకు కదిలితేనే వెండితెరపై ఫ్రేమ్ పడుతుంది. లొకేషన్‌లో మేకప్ నుంచి ప్యాకప్ దాకా అన్నీ పక్కానో కాదో.. ప్రొడక్షన్ విభాగం చూసుకుంటేనే బండి ముందుకు కదిలేది. సంగీతం, కళ, కూర్పు, పోరాటాలు, ఛాయాగ్రహణం, నృత్యం, రచన.. ఇలా 24 విభాగాలూ శక్తికి మించి శ్రమిస్తుంటాయి. ప్రతి విభాగంలోనూ శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరుస్తుంటుంది. రాళ్లెత్తిన కూలీల్లాగే.. సినీ సీమలోనూ రంగుల కళ కోసం చెమటోడుస్తున్న శ్రామికులు ఎంతో మంది. 'సినిమా' అనే తపనే వాళ్లని ముందుకు నడిపించేది. ఆ సినిమా కోసం ఎన్ని కష్టాలైనా పడతారు. ఎన్ని కన్నీళ్ళైనా దిగమింగుతారు. విశాఖలోనూ ఈ సినీ కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. వీరంతా కష్టంగా బతుకీడుస్తున్నారు. సినీ ఇండస్ట్రీకి ఈ మహా నగరం ఎంతో అనుకూలమని, ప్రభుత్వం సహకరిస్తే మంచి ఫలితాలు వస్తాయని వారు చెబుతున్నారు. తమ బతుకులకూ కాసింత ఉపాధి దొరుకుతుందని ఆశిస్తున్నారు.

అసంఘటితరంగ కార్మికులకు భద్రత ఏదీ?

ప్రజాశక్తి - కలెక్టరేట్

అసంఘటితరంగ కార్మికుల బతుకులకు భద్రత లేకుండా పోయింది. అరకొర పనులతో అర్ధాకలితో అలమటిస్తున్నారు. కార్మిక చట్టాలున్నా అమలు కాకపోవడం వల్ల కనీస వేతనాలు అందటం లేదు. ఉద్యోగ భద్రత లేకపోగా, కనీసం ప్రాణాలకు కూడా రక్షణ లేదు. ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని పని చేయాల్సిందే. లేదంటే పూట గడవని పరిస్థితి. భవన నిర్మాణ రంగం, ఆటో, తోపుడుబండ్లు, షాపులు, మోటారు, క్వారీ, ఇంటిపని వారుల కార్మికుల జీవన పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వెట్టిచాకిరీ, చాలీచాలని వేతనాలు, అర్ధాకలితో జీవనం ఏ క్షణంలో ప్రాణాలు పోతాయో తెలియని పరిస్థితి. ఇదీ అసంఘటిత రంగ కార్మికుల దుస్థితి.

రోడ్లు వేయడం, భవనాల నిర్మాణంలో పాలు పంచుకోవడం, ఇంటి పనివారాల వరకు అనేక రకాల సేవలందిస్తున్నారు. పట్టణాల అభివృద్ధిలో అసంఘటితరంగ కార్మికులే ప్రధాన భూమిక పోషిస్తున్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలు, సంస్థలు, ఆసుపత్రులు, కార్పొరేషన్లలో కాంట్రాక్టు, ఎన్ఎంఆర్, అవుట్ సోర్సింగ్ ఇలా పేరు ఏదైనా వీరికి ఎలాంటి భద్రతా లేదు. పర్మినెంట్ కార్మికులతో సమానంగా అధిక సమయం పని చేసినా కనీస వేతనాలు అమలు కాలేదు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు లేవు. ప్రతి నెలా జీతం వస్తుందన్న గ్యారంటీ లేదు. కార్మిక చట్టాలు వీరి దరిదాపులకు చేరడం లేదు. భవనం నిర్మాణ రంగం, ఆటో, తోపుడుబండ్లు, షాపులు, హెూటళ్లు,మోటారు, క్వారీ, ఇంటిపనివారుల కార్మికుల జీవన పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో వచ్చే కూలీ డబ్బులు చాలక నానా అవస్థలు పడుతున్నారు.

ప్రభుత్వం మారితే, తమ బతుకులు బాగుపడతాయని, ఆశపడ్డ వీరి పరిస్థితి' పెనం లోంచి పొయ్యిలో పడినట్లుగా'మారింది. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వీరి కోసం ప్రభుత్వం ఎటువంటి పథకాలను ప్రత్యేకంగా అమలు చేయటం లేదు సరి కదా, వీరికి ఉన్న సౌకర్యాలను ప్రయోజనాలను కూడా వైసిపి ప్రభుత్వం అందకుండా చేస్తోంది. అసంఘటితరంగ కార్మికుల్లో అధిక సంఖ్యలో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కైంకర్యం చేస్తోంది. భవనాలు నిర్మించే టప్పుడు, రోడ్లను వివిధ కట్టడాలను నిర్మించే సమయంలో వాటి నిర్మాణ వ్యయంలో 1 శాతం సొమ్మును సెస్ రూపంలో వాటిని నిర్మించేవారు సంక్షేమ బోర్డుకు కార్మిక శాఖ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి నిర్మాణాలు ప్రైవేట్ వ్యక్తులు చేసినా, ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగినా, సెస్ మాత్రం చెల్లించాల్సిందే. ఈ విధంగా సంక్షేమ బోర్డుకు రూ.2,850 కోట్లు సొమ్ము ఉండగా, వైసిపి ప్రభుత్వం ఇందులో సుమారు రూ.1300 కోట్లను వాడేసి, వేరే వాటికి ఆ నిధులను ఖర్చు చేసింది. సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు అనేక రూపాలలో ఆర్థిక సహాయాన్ని అందించాల్సి ఉంది. ఈ రంగంలో పనిచేస్తున్న మహిళలు కాన్పు సమయంలో రూ.20 వేలు ఉచితంగా ఇవ్వాలి. కార్మికుల పిల్లల వివాహ సమయంలో కూడా రూ.20 వేలు ఇవ్వాలి. భవన నిర్మాణ కార్మికులు ఎవరైనా సహజ మరణం చెందితే రూ.80 వేలు, ప్రమాదంలో మరణిస్తే రూ.5.2 లక్షలు ప్రభుత్వం చెల్లించాలి. వీరి పిల్లల చదువులకు స్కాలర్ షిప్పులు ఇవ్వాలి. వైసిపి ప్రభుత్వం వచ్చాక ఇటువంటి చెల్లింపులు అన్ని పూర్తిగా ఆగిపోయాయి. కరోనా సమయంలో భవన నిర్మాణ కార్మికులతో పాటు, ఇతర రంగాలలో పనిచేస్తున్న అసంఘటితరంగ కార్మికులకు దాదాపు ఏడాది పాటు పనులు లేవు. తమ స్వగ్రామాలకు అనేకమంది వలసలు వెళ్లారు. ఆ సమయంలో అనేకమంది భోజన వసతి సదుపాయాలు లేక ఆకలితో అలమటించి ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వం వీరిని ఆదుకోలేక పోయింది. ఈ నేపథ్యంలో ఇటువంటి కార్మికులంతా బ్యాంకు ఖాతాలను తెరిచి, వాటి వివరాలను కార్మిక శాఖ అధికారులకు సమర్పిస్తే, అటువంటి వారికి కరోనా సాయంగా ఒక్కొక్కరికి కనీసం రూ.25 వేలు చెల్లిస్తామని, ప్రభుత్వం ప్రకటించి, బ్యాంకు ఖాతాలు వివరాలను సేకరించింది. ఇది జరిగి సుమారు పేడాదిన్నర కాలం జరిగినప్పటికీ, ఒక్కరంటే, ఒక్కరికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం సహాయం అందివ్వలేదు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం పట్ల వైసిపి ప్రభుత్వం ఎంత మోసపూరితంగా వ్యవహరిస్తుందో ఈ ఉదాహరణ చాలు.



సమగ్ర చట్టం సాధించుకోవడమే పరిష్కారం

అసంఘటితరంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి కేరళ రాష్ట్రం తరహాలో సమగ్ర చట్టాన్ని తీసుకు రావాలని కార్మిక కార్మిక సంఘాలు గత దశాబ్ద కాలంగా కోరుతున్నాయి. ప్రభుత్వాలు మాత్రం ఈ డిమాండ్‌ను ఖాతరు చేయడం లేదు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు అప్పుల పాలవుతున్నారు. అనేక రూపాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న వీరికి తప్పనిసరిగా కనీస వేతనాలను అమలు చేయాలి. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందేవ్వాలి. బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలి. వీటిని సాధించుకునేందుకు ప్రభుత్వంపై సమైక్యంగా సమరభేరి మోగించిడమే నేడు అసంఘటిత రంగ కార్మికుల ముందున్న కర్తవ్యం.

నగరంలో ఆరు లక్షల మంది కార్మికులు

పారిశ్రామిక రాజధానిగా పేరు ఉన్న విశాఖ నగరంలో సుమారు ఆరు లక్షల మంది వరకు అసంఘటితరంగ కార్మికులు ఉన్నారు. వీరిలో లక్ష మంది వరకు భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరి తర్వాత అధిక సంఖ్యలో సుమారు 50 వేల మంది ముఠా కార్మికులు ఉన్నారు. వీరిలో వలస కూలీలు ఎక్కువ మంది ఉండగా వీరంతా, అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు. వీరి ఆదాయంలో సగం అద్దెలకే చెల్లించాల్సి వస్తోంది. దీంతో బియ్యం తప్ప మిగిలిన సరుకులేవీ కొనుగోలు చేయలేక పోతున్నారు. పాలు, మాంసం, గుడ్లు, ఆకుకూరలు పౌష్టికాహారం తీసుకుంటున్న కుటుంబాలు చాలా అరుదు. పౌష్టికాహారం తీసుకోకపోవడం, గాలి వెలుతురు లేని ఇండ్లు, పారిశుద్ధ్య లేని పరిసరాల్లో నివసిస్తుండడంతో తరచూ వీరు రోగాల బారిన పడుతున్నారు భవన నిర్మాణ కార్మికులకు సంవత్సరంలో 100 రోజులకు మించి పని దొరకడం లేదు. ఆ కూలి డబ్బులతోనే అప్పులతో ఏడాది పాటు జీవిస్తున్నారు. అసంఘటిత రంగ కార్మికుల పిల్లలు 10వ తరగతి, ఇంటర్మీడియట్ తోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. తల్లిదండ్రుల కూలి డబ్బులతో ఇల్లు గడవక పోవడంతో పిల్లలను చదువు మాన్పించి పనికి పంపిస్తున్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థను ఆశ్రయం

అసంఘటిత రంగంలోని ఆటో, బిల్డింగ్, ముఠా, తోపుడుబండ్ల కార్మికులకు బ్యాంకుల ద్వారా అప్పులు అందక పోవడంతో వీరు మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తున్నారు. వీరి కుటుంబ అవసరాలకు, పెళ్లిళ్లు, పండగలు, వైద్యం, పిల్లల చదువులు ఇలా అన్నింటికీ ఈ సంస్థల వద్ద అప్పులు తీసుకుంటున్నారు. వీరి అవసరాలను అడ్డు పెట్టుకొని ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీ రూపంలో వీరి రక్తాన్ని పీలుస్తున్నాయి నూటికి 10 రూపాయల వడ్డీ రూపంలో గుంజుతున్నారు. రోజువారి ఫైనాన్సు కింద రూ.10 వేలు తీసుకుంటే రూ. 8800 మాత్రమే ఇస్తారు.100 రోజుల్లో పదివేలు కట్టాలి. రెండు రోజులు డబ్బులు కట్టకపోతే వేధింపులు తప్పవు. ఫైనాన్స్ సంస్థల దోపిడీకి గురికాని అసంఘటితరంగ కార్మికులు నగరంలో లేరంటే అతిశయోక్తి కాదు. పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడం, వచ్చిన కూలీ డబ్బులను వడ్డీలకు చెల్లించడం తప్పడం లేదు. వీరు 8 గంటల పని దినం చట్టం పరిధిలోకి రావడం లేదు. ఆటో, భవన నిర్మాణం, ముఠా, తోపుడుబండ్లు, ఇంటి పనివారాలు, స్వయం ఉపాధి వంటి రంగాల్లోనూ కార్మికులు సుదీర్ఘ పనిగంటలు పని చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలే తక్కువ కాగా, ఈ వేతనాలు కూడా అమలు కావడం లేదు. శ్రామిక మహిళలు మరింత దోపిడికి గురవుతున్నారు. మహిళా కార్మికులకు సమాన పనికి సమాన వేతన చట్టం కచ్చితంగా అమలు చేయాలని ఉన్నా అమలు కావడం లేదు.

శ్రామిక సింధూరం

ఓ కార్మికా....
నవ నిర్మాణ కారకా
అక్షరం ముక్కరాని నీ కరములతో
ఆకాశ హర్మ్యాలు నిర్మించావు
అనాది కాలం నుండి
నీ శ్రమ పునాదులపైనే
ఈ ప్రపంచం నిర్మితమైనది
ఈజిప్ట్ పిరమిడ్‌లైనా
చైనా గోడయినా
అంబరాన్నంటే శిఖరాలైనా
తాజ్‌మహల్ అయినా
లోటస్ టెంపుల్ అయినా
మెదక్ చర్చి అయినా
ప్రపంచ ప్రసిద్ధినొందిన ఏ కట్టడమైనా
నీ స్వేదంతో తడిసి ముద్దయినదే !!
బొగ్గు గనులనయినా నుగ్గు చేసే శక్తి
బంగారపు లోయైనా పిండిచేసే సత్తా
నీ నరనరాల్లో నిక్షిప్తమై ఉంది !
కొండల్ని పిండి చేసి
బండల్ని ఉండలు చేసి
మిద్దెలపై మిద్దెలు కట్టిన నీకు
ఇరుకిరుకు ఇల్లే !
సుందర నగరాల్ని నిర్మించిన నీకు
మురికివాడలే ఆవాసాలు
గరీబైన శ్రామికుల స్వేదపు నదుల్లో
ఖరీదైన నవాబుల విచ్చలవిడి విహారం
భారీ యంత్రాలనైనా కదిల్చే నీ కండబలం
ముందు
భారీగా బొజ్జలు పెంచే దోపిడీదారులు
బలాదూర్
శ్రమ దోపిడీని ప్రతిఘటించి చేపట్టిన
అరుణ వర్ణ పతాకపు అణువణువూ నీదే
ఆకాశాన ఎగిరే అరుణ పతాకపు సింధూరం
నీదే !

వి.శ్రీఉమామహేశ్వరి
81213 28416

చెమట చుక్కను చిందిస్తేనే...

కుదిరితే పరిగెత్తు.. ,
లేకపోతే నడువు...
అదీ చేతకాకపోతే...
పాకుతూ పో.... ,

అంతేకానీ ఒకే చోట అలా
కదలకుండా ఉండిపోకు...
ఉద్యోగం రాలేదని,
వ్యాపారం దెబ్బతినిందని,
స్నేహితుడొకడు మోసం చేశాడని,
ప్రేమించినవాళ్ళు వదిలి వెళ్ళి పోయారని...
అలాగే ఉండిపోతే ఎలా?

దేహానికి తప్ప, దాహానికి పనికిరాని
ఆ సముద్రపు కెరటాలే ఎగిసి ఎగిసి
పడుతుంటే...
తలుచుకుంటే...
నీ తలరాత ఇంతే అన్నవాళ్ళు కూడా...
నీ ముందు తలదించుకునేలా
చేయగల సత్తా నీది,
అలాంటిది ఇప్పుడొచ్చిన
ఆ కాస్త కష్టానికే తలొంచేస్తే ఎలా?
సృష్టిలో చలనం ఉన్నది ఏదీ ఆగిపోకూడదు.
పారే నది.., వీచే గాలి..., ఊగే చెట్టు...,
ఉదయించే సూర్యుడు....
అనుకున్నది సాధించాలని
నీలో కసికసిగా ప్రవహిస్తుందే
ఆ నెత్తురుతో సహా....,,
ఏదీ ఏది ఆగిపోడానికి వీల్లేదు..,
లే... బయలుదేరు...
నిన్ను కదలనివ్వకుండా చేసిన
ఆ మానసిక బాధల
సంకెళ్ళను తెంచేసుకో... ,
పడ్డ చోటు నుండే పరుగు మొదలుపెట్టు...

నువ్వు పడుకునే పరుపు...
నిన్ను చీదరించుకోకముందే
బద్ధకాన్ని వదిలేయ్...,
నీ అద్దం....
నిన్ను ప్రశ్నించకముందే
సమాధానం వెతుక్కో... ,
నీ నీడ నిన్ను
వదిలేయకముందే
వెలుగులోకి వచ్చేయ్..,
మళ్ళీ చెప్తున్నా...

కన్నీళ్ళు కారిస్తే కాదు...,
చెమట చుక్కని చిందిస్తేనే
చరిత్రను రాయగలవని తెలుసుకో..
చదివితే ఇవి పదాలు మాత్రమే,
ఆచరిస్తే... అస్త్రాలు.

- మహాకవి శ్రీ శ్రీ

సలాం కార్మికుడా.... జై శ్రామికుడా....

నిప్పులారపోసినట్లున్న మిరప కల్లంలో కాయలేరుతున్న కన్య
తలగుడ్డతో కొత్త అందం
నదిలో పడవల నుంచి వల విసురుతున్న జాలరిపై పడే
భానుని కిరణాల వెలుగులలో
సున్నం తట్ట కట్టడాలకు మోస్తున్న
తల్లి నలుపు తెలుపుల సౌందర్యంలో
కొప్పున చామంతులెట్టి పచ్చిగడ్డి మోస్తున్న
పడతి నడకలో ఎంకి అందంలో
సప్తవర్ణాల దారపు పోగుల చీర నేస్తున్న
చేనేత కార్మికుడి చేతల విన్యాసంలో
నడుముకు నవరత్నాల వడ్డాణం
చెక్కుతున్న విశ్వ బ్రాహ్మణుడి హస్తంలోని మెరుపులలో
హస్తలాఘవంతో మట్టితో కుండలు చేస్తున్న
కుమ్మరి వంగిన తనువులో
మండుటెండలో మల్లెలు కోస్తున్న
బాలిక లేలేత ముఖారవిందంలో
ఏట్లో రాయిపై ఉతికే బట్టల రజకుని శబ్దాల మోతలలో
కొండపై లడ్డు బూంది దేవుతున్న
వంట బ్రాహ్మడి స్వేదంతో తడిసిన కుంకుమలో
పూమాలలు కడుతున్న హస్తంలో తిరుగుతున్న
దారపు కదలికలో
గాజుల కారా?నాలో కాలుతున్న రంగులతో
ఎరుపెక్కిన చేతులలో
రంగులతో చక్కటి చిత్రాన్ని చిత్రిస్తున్న
చిత్రకారుని కుంచెలో
రాతిలో దైవాన్ని చెక్కుతున్న శిల్పకారుని
నైపుణ్యంలో...శ్రమైకజీవన సౌందర్యం
శ్రమలోనే వారి ఆనందం
శ్రమతోనే కదా మన ప్రగతి
సలాం కార్మికుడా
జై శ్రామికుడా

- సామినేని శైలజ

నేడే మేడే మేడే మేడే..

అన్యాయం అక్రమాలు దోపిడిలు దురంతాలు
ఎన్నాళ్ళని ఎన్నేళ్ళని నిలదీసినదీ రోజు
అణగారిన శ్రమశక్తిని ఆవేశం ఊపిరిగా
కదిలించినదీ రోజు రగిలించినదీ రోజు
నేడే మేడే మేడే మేడే
ఆ ఆ ఆ

సమభావం మానవాళి గుండెలలో నిండగా
సఖలదేశ కార్మికులకు ఈనాడే పండగ
లోకానికి శ్రమవిలువను చాటినరోజు
ఇది చీకటిలో చిరుదివ్వెలు వెలిగిన రోజు
నేడే మేడే మేడే మేడే

వేదనలు రోదనలు వేదనలు రోదనలు
అంతరింపచెయ్యాలని
బాధల కేదారంలో
శోధన మొలకెత్తింది
చిరకాలపు దోపిడీపై
తిరుగుబాటు జరిగినపుడు
చిందిన వెచ్చని నెత్తురు
చేతనమై నిలిచింది
నేడే మేడే మేడే మేడే
భావనలో నవచేతన
పదునెక్కిన ఆలోచన
రేపటి ఉదయం కోసం
రెప్పలు విప్పాయి
ఆ ఆ ఆ ఆ

బిగిసిన ఈ పిడికిళ్లు ఎగసిన ఆ కొడవళ్లు
శ్రామిక జన సారధిగా క్రమించమని అడిగాయి
నేడే మేడే మేడే మేడే
నేడే మేడే మేడే మేడే
ఎన్నెన్నో దారులలో చీలిన మన ఉద్యమాలు
ఎన్నెన్నో తీరులలో చెమటోడ్చే శ్రమజీవులు
ఐక్యంగా నిలవాలి కథనానికి కదలాలి
సౌమ్యవాద సాధనకై సమరం సాగించాలి
నేడే మేడే మేడే మేడే

చిత్రం : ఎర్ర మల్లెలు (1981)
సాహిత్యం : అదృష్ట దీపక్
సంగీతం : చక్రవర్తి
గానం : యస్‌పి.బాలసుబ్రహ్మణ్యం



ఆదర్శ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య



'మన ఆర్థిక వ్యవస్థను ఆంగ్లో (బ్రిటన్)-అమెరికన్ సామ్రాజ్యవాదుల ఆర్థిక వ్యవస్థలతో ముడిపెట్టారు. అందువల్లనే బ్రిటన్‌లోగానీ, అమెరికాలోగానీ ఆర్థిక మాంద్యం ఏర్పడితే దాని ప్రభావం మన దేశం మీద పడుతున్నది. ఆ విధంగా మనం నిస్సహాయులమవుతున్నాం. జాతీయ ప్రణాళికను రూపొందించుకునే సందర్భంలో మనం కొన్ని సూత్రాలను పాటించాల్సి ఉంటుంది. ఒక ప్రణాళికను రూపొందించుకోవాలంటే మన విదేశీ వ్యాపారంపై పూర్తి కంట్రోలు ప్రభుత్వానికి ఉండాలి. వ్యక్తులకూ ప్రయివేటు కంపెనీలకూ వదిలివేయరాదు. విదేశీ వ్యాపారం ప్రయివేటు సంస్థల చేతుల్లో ఉండటం మూలంగా మనం ఏమీ చేయలేకపోతున్నట్లు ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో చెప్పారు. వాస్తవంగా మన ప్రణాళిక అంతా అమెరికా ఇచ్చే అప్పులపైనా.. విదేశాల సహాయంపైనా ఆధారపడి ఉంది. ఇది ఘోరమైన విషయం. మేము విదేశీ సహాయాన్ని తీసుకోవడానికి వ్యతిరేకం కాదు. మన పట్ల అమెరికా వ్యవహరిస్తున్న వైఖరికే మేము వ్యతిరేకం'.

– 1952 మే 28న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ మీద చర్చ సందర్భంగా రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడుగా కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చేసిన తొలి ప్రసంగంలోని వ్యాఖ్యానాలివి.

అప్పట్లో ఆయన వ్యక్తీకరించిన అభిప్రాయాలు ఈనాటి పాలకులు అమలు చేస్తున్న 'సంస్కరణల' నేపథ్యంలో పరిశీలిస్తే.. ఆయన భవిష్యత్తులో మన దేశం ఎదుర్కోబోయే దుష్పరిణామాలను అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలిగారా అనిపిస్తుంది. అందుకే ఆయన దార్శనికుడు. గొప్ప పార్లమెంటేరియన్ కూడా.

పార్లమెంటేరియన్‌గా ఆయనకు అవార్డులు రాకపోవచ్చు. చాలా మందిలా ఆయన ప్రసంగాలు గంభీరంగా లేకపోవచ్చు. ప్రసంగాలు సాదాసీదాగానే ఉన్నా.. నమ్రత, విషయ ప్రధానం.. ఇతరులను ఆలోచింప చేసే నిర్దిష్టతలు.. మాట్లాడే అంశంపై విశేషాధ్యయనం, తిరుగులేని సాధికారిత.. సుందరయ్య సొత్తు. పార్లమెంట్‌లో చర్చకు వచ్చే ఏ అంశంపైనైనా ఆయన సమగ్రంగా అధ్యయనం చేసి సాధికారికంగా ప్రసంగించేవారు. ఆర్థిక, రాజకీయాలతోపాటు.. చరిత్ర, కళలు, సారస్వతం, న్యాయ సంబంధ విషయాలు, ఇలా అన్ని అంశాలపైనా ఆయన సాధికారిత కలిగి ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమానికి నాయకత్వం వహించిన జాతీయ నాయకుల్లో అతి ముఖ్యుల్లో ఒకరైన 62 సంవత్సరాల ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ ఎదుట.. బాల్యం నుంచీ స్వాతంత్రోద్యమంలో పాల్గొని, బాల్యంలోనే జైలుకెళ్లి, చరిత్ర ప్రసిద్ధిగాంచిన తెలంగాణా సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన 39 ఏళ్ల సుందరయ్య ప్రతిపక్ష నేతగా పనిచేయగలగడం అరుదైన విషయమే. అలాగే ఒక నియోజకవర్గ శాసనసభ్యుడుగా ఆయన తన నియోజకవర్గ ప్రజలతో మమేకమైన తీరు, వారి సమస్యల పరిష్కారానికి ఆయనిచ్చిన ప్రాధాన్యత, ప్రతిపక్ష నేతగా మొత్తంగా దేశ, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబిస్తూ ఆయన చేసిన ప్రసంగాలు చరిత్రలో మైలురాళ్లుగా నిలుస్తాయి. అంతేకాదు ప్రతిపక్ష నేతకు (పర్యాయపదంగా) అసలు సిసలు మూర్తిగా కనిపిస్తారు. హుందాగా.. నిండుగా.. నిర్మలంగా.. క్రమశిక్షణకు మారుపేరుగా.. కనిపిస్తారు. మూడేళ్లపాటు పార్లమెంటులో, పదిహేనేళ్లపాటు రాష్ట్ర శాసనసభలో వివిధ సందర్భాల్లో ఆయన చేసిన ప్రసంగాలు రేఖామాత్రంగా కొన్ని పరిశీలిద్దాం. ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులకు సంబంధించి ఆనాటి పరిస్థితులను తెలుసుకోవడానికీ.. ప్రస్తుత రాజకీయ పోకడ తెలుసుకోవడానికీ, ఈనాటి పరిస్థితులకు వర్తింపచేసుకొని పరిశీలించడానికీ ఎంతగానో ఉపకరిస్తాయి.

1952 జూలై 16న 'ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు'పై రాజ్యసభలో ప్రవేశపెట్టిన అనధికార తీర్మానం మీద ప్రసంగించారు. మన దేశంలోని రాష్ట్రాలను పునర్విభజించాలనీ.. ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలనే డిమాండ్ గత 40 ఏళ్లుగా ఉంది. ఇందుకు కాంగ్రెస్‌వారు కూడా అంగీకరించారు. కానీ ఆచరణలోకి వచ్చేటప్పటికి కాంగ్రెస్ దాన్ని తిరస్కరించుతున్నది. ఇక్కడ ప్రధానమంత్రి వంటి ప్రముఖుడి నుంచే మాటిమాటికీ వింత వాదనలు వస్తున్నాయి. భాషా రాష్ట్రాలు ఏర్పడటమంటే విచ్ఛిన్నమట. భారతదేశం పాకిస్తాన్‌లాగా విడిపోవడమట. ఇది తప్పుడు పోలికని ప్రభుత్వానికి మనవి చేయదలిచాను. మరి కాంగ్రెస్‌వారు గత 30 ఏళ్లుగా మన దేశంలో భాషారాష్ట్రాలు ఏర్పడాలని ఎందుకు చెబుతున్నారు? ఆంధ్రులమైన మేము భారతదేశాన్నించి విడిపోతామని ఎప్పుడూ చెప్పి ఉండలేదే?. ఇంతలో ఆనాటి హైదరాబాద్ స్టేట్‌కు చెందిన రాజ్యసభ సభ్యులు వి.కె.దగే జోక్యం చేసుకుంటూ.. ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ప్రధానమంత్రి అంగీకరించారు. అయితే ఏర్పడబోయే ఆంధ్ర రాష్ట్రంలో తమ ప్రాంతాన్ని కూడా కలపవలసిందిగా హైదరాబాద్ రాష్ట్రంలోని తెలంగాణా ప్రజల కోర్కెను ప్రధానమంత్రి అంగీకరిస్తారా? అని ప్రశ్నించారు. సభలోనే ఉన్న ప్రధాని నెహ్రూ దీనికి ఎంతమాత్రమూ అంగీకిరించేది లేదని చెప్పారు. ఈ దశలో సుందరయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. ప్రభుత్వ ఉద్దేశం ప్రకారం ఎంతకాలంలో ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తారు? అందుకు ఇప్పట్నించే అవసరమైన చర్యలు తీసుకుంటారా? అని సూటిగా అడిగారు. దీనికి నెహ్రూ.. చర్యలు తీసుకునే ప్రశ్నే లేదని చెప్పారు. దానిపై బహిరంగ ప్రకటనలు చేయడం వల్ల ఉపయోగం లేదన్నారు. ఆ నేపథ్యంలో.. ఇప్పటి పరిస్థితులను గమనించినప్పుడు ఈ అంశంపై నాటికీ నేటికీ కాంగ్రెస్ విధానం రెండు నాల్కల ధోరణితోనే కొనసాగుతోంది.

ప్రజాఉద్యమాలపై ఉక్కుపాదం మోపి వాటికి నాయకత్వం వహించే నేతలను అక్రమంగా నిర్బంధించేందుకు ఉద్దేశించిన '1950వ సంవత్సరపు ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని' ఆమోదం కోసం రాజ్యసభలో ప్రవేశపెట్టిన సందర్భంగా.. 1952 ఆగస్టు 8న సుందరయ్య ప్రసంగించారు. 'ఇది విషపూరితమైన ప్రజావ్యతిరేక చట్టం. ఈ చట్టానికి తేనెపూసి మనలను ఒప్పించడానికీ.. దాన్ని మనచేత మింగించడానికీ హోంమంత్రి ప్రయత్నిస్తున్నారు. ఈ పంచదార పూతలు మనలను మోసగించజాలవు. ఈ బిల్లు ప్రజలపై యుద్ధం ప్రకటించడంగాక మరేమిటి?. మేము ప్రజల్లో, కార్మిక కర్షకుల్లో పనిచేస్తూ వారి కష్టాలను గురించి ప్రభుత్వానికి తెలియజేస్తూ.. వారి న్యాయమైన కోర్కెల కోసం సాగే పోరాటాలకు నాయకత్వం వహిస్తున్నాం. వారి న్యాయమైన డిమాండ్లను ఆమోదించడానికి బదులుగా 'పబ్లిక్ సేఫ్టీ ఆర్డినెన్స్' తెచ్చి ప్రజలకు నాయకత్వం వహించే నేతలందరినీ అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో బంధించారు. ప్రజలకోసం పనిచేసే నాయకులను నిర్బంధించి తమ దుష్పరిపాలనను నిరాటంకంగా కొనసాగించదలిచారు. 1948 నుంచి 51 వరకూ మా పార్టీని అణచివేసేందుకు పూనుకున్నారు. ప్రజల కోసం సంవత్సరాల తరబడి అజ్ఞాతవాసంలో ఉండి పనిచేయాల్సి వచ్చింది. ఆకాలంలో ఎన్నో ఘోరాలు, అత్యాచారాలు, మానవ హననాలకు అంతేలేకుండా పాల్పడ్డారు. వేల మంది కమ్యూనిస్టులను కాల్చిచంపారు. వందల మంది స్త్రీలను చెరిచారు. ఇప్పుడు ప్రవేశపెట్టిన ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం ప్రజల ప్రజాతంత్ర ఉద్యమాలను మన దేశంలో అణచివేస్తోందనే ఉద్దేశంతోనే మేం ప్రధానంగా దాన్ని వ్యతిరేకిస్తున్నాం' అని సుందరయ్య అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణాలోనూ, దానికి అండదండలిస్తున్న ఆంధ్రప్రాంతంలోనూ జరిగిన ఘోర ఉదంతాలను వదిలిపెట్టకుండా ఆయన సోదాహరణంగా వివరించారు. సుందరయ్య పాల్గొన్న ఈ చర్చ దాదాపు నాలుగు గంటలకు పైగానే జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన అనేకమంది పార్లమెంట్ సభ్యులు జోక్యం చేసుకొని కమ్యూనిస్టుల దేశభక్తినీ.. రష్యాకు మద్దతుగా మాట్లాడటం గురించీ ప్రస్తావించారు. దీనిపై సుందరయ్య వారికి గట్టి జవాబే ఇచ్చారు. 'మా దేశాన్ని మేం ప్రేమిస్తాం. గర్వపడతాం. ఐదువేల సంవత్సరాలకుపైగా మహోన్నతమైన నాగరికతను కలిగిఉన్న భారతదేశం గురించి మేం గర్వపడతాం. సముద్రగుప్తుడు, చంద్రగుప్తుడు లాంటి మహావీరుల దేశమైన ఈ భూమిని మేం ప్రేమించుతాం. కళలకు పుట్టినిల్లుగా ఉన్న ఈ గడ్డను మేం ప్రేమించుతాం. అజంతా, ఎల్లోరా, తాజ్‌మహల్‌ను కలిగిన ఈ దేశాన్ని మేం ప్రేమించుతాం. వాల్మీకి, కాళిదాసు, తులసీదాసు, కంబరు, వేమన, నన్నయ్యలాంటి కవులకు జన్మనిచ్చిన ఈ దేశాన్ని ప్రేమించుతాం. వంగ కవి రవీంద్రనాథ్ ఠాగూర్, ఆంధ్ర మహాకవి గురజాడ అప్పారావు వంటివారు ఈదేశంలో జన్మించి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురించి కవితలల్లి గానం చేశారు. అలాంటివారికి చెందిన ఈగడ్డను మేం ప్రేమించుతాం. ఈ దేశం కోసం ఎలాంటి త్యాగాలు చేయడానికైనా మేం సిద్ధంగా ఉన్నాం. మేం మా దేశాన్ని ప్రేమించుతున్నామంటే.. మన గతాన్నుంచి గర్వపడుతున్నాం. గతం గతించింది. ఇప్పుడు మనం వర్తమానంలో ఉన్నాం. భవిష్యత్తు కోసం కృషి చేస్తాం. మన దేశాన్ని మేం ప్రేమించుతున్నామంటే మన మహాకవి గురజాడ నుడివినట్లు దేశమంటే మట్టికాదు.. ప్రజలని పాలకులు అర్థం చేసుకోవాలి. ప్రజాసేవలో సర్వం త్యాగం చేయడానికి మేం సంసిద్ధులమే అని తన ప్రసంగానికి అడ్డుపడుతున్న పాలకపార్టీ సభ్యులను నోరు మూయించారు. ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాన్ని సభ తిరస్కరించాల్సిందిగా కోరుతూ సుందరయ్య ప్రసంగం ముగించారు. అదే సంవత్సరం డిసెంబర్ 16న ప్రథమ పంచవర్ష ప్రణాళిక'పైన, 1953 సెప్టెంబరు 2న 'ఆంధ్రరాష్ట్ర నిర్మాణం' బిల్లుపైనా, 1954 ఆగస్టు 26న 'భారత ప్రభుత్వ విదేశాంగ విధానం' మీద, అదే ఏడాది నవంబర్ 29న 'ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధింపు'పైనా రాజ్యసభలో ఆయన సాధికారిక ప్రసంగాలు చేశారు.



సిపిఎం తొలి పొలిట్ బ్యూరో

సుందరయ్య 1955లో శాసనసభకు గన్నవరం నుంచి ఎన్నికయ్యారు. 62, 78ల్లో కూడా అక్కణ్ణుంచే మళ్లీ ఎన్నికయ్యారు. 1956 ఏప్రిల్ 2న రాష్ట్రాల పునర్నిర్మాణ బిల్లుపై సుందరయ్య శాసనసభలో ప్రసంగించారు. విశాలాంధ్ర ఏర్పడుతుందంటే ప్రతి ఆంధ్రుడూ హర్షిస్తాడు. గర్విస్తాడు. కానీ మనలను భవిష్యత్తులో ఎదుర్కొనే ప్రమాదాలను గురించి కూడా ఈ సంతోష సమయంలో ఆలోచించాల్సి ఉంటుంది. బహుభాషా రాష్ట్రాలను భవిష్యత్తులో ఏర్పరచడానికి కావలసిన ప్రాతిపదికలు ఈ బిల్లులో ఉన్నాయని మా అభిప్రాయం. ఈ విషయం చాలా ప్రమాదకరమైనది. ఈ ప్రాతిపదికలు వాస్తవ రూపం ధరిస్తే విశాలాంధ్రకే ముప్పు వస్తుంది. మండల సంఘాలు సలహా సంఘాల ద్వారా నడుస్తాయంటున్నారు. వీటికి డబ్బు దండగ. ఇవి నిరర్థకం. అని సుందరయ్య వాదించారు. ఓసారి భూ సంస్కరణల అమలుపై సుందరయ్య శాసనసభలో రెండు గంటలసేపు ప్రసంగించారు. ప్లానింగ్ కమిషన్ సూచనమేరకైనా భూసంస్కరణలను అమలు జరపాలని గట్టిగా డిమాండ్ చేశారు. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో పేర్కొన్న.. జాతీయాదాయం నాలుగో వంతుకు పెంపు, భారీ పరిశ్రమల స్థాపన, నిరుద్యోగులకు ఉపాధి కల్పన, ఆర్థిక వ్యత్యాసాల తగ్గింపు వంటివి ప్రతి భారతీయుడూ బలపరుస్తున్నాడనీ.. అయితే ప్రణాళికలో సూచించిన మార్గాల వల్ల ఈ ఆశయాలు నెవవేరగలవా అన్నదే ప్రశ్న అన్నారు. ఈవిధంగా పదేళ్లపాటు శాసనసభలో ప్రతిపక్ష నేతగా.. మరో ఐదేళ్లపాటు సిపిఎం పక్ష నేతగా పనిచేసిన కాలంలో ఆయన వందల ప్రసంగాలు చేశారు. అంతేకాదు.. ఒక శాసనసభ్యుడుగా ప్రజల సమస్యలనూ, వారి కష్టసుఖాలను తెలుసుకోవడానికి సైకిల్‌పై గ్రామాలు పర్యటించిన నాయకుడు దేశంలో సుందరయ్య ఒక్కరే. గన్నవరం నియోజకవర్గంలోని దాదాపు అన్ని గ్రామాలనూ సైకిల్‌పైనే పర్యటించారు. ఆయన ప్రతి ఆరునెలలకోసారి నియోజకవర్గాన్ని చుట్టివచ్చేవారు. గ్రామానికీ గ్రామానికీ మధ్య సైకిల్ ప్రయాణం. పార్టీ కార్యకర్తలు కూడా సైకిళ్లతోనే ఆయననుసరించేవారు. కొన్ని గ్రామాలకైతే సైకిల్ మీద వెళ్లడానికి వీలుండేది కాదు. చిక్కవరం నుంచి చింతగుంట (శివారు గ్రామం) వెళ్లడానికి రోడ్డు లేదు. పొలం గట్లపైనే నడిచిపోవాలి. కనుక చిక్కవరంలో సైకిళ్లు పెట్టి దాదాపు కిలోమీటరున్నర దూరం పొలంగట్లపైన నడిచి చింతకుంట చేరుకునేవారు. ఈ రెండు గ్రామాల మధ్య ఓ చిన్న డొంక ఉండేది. ఈ రెండు గ్రామాల వారు (అటు నుంచీ.. ఇటు నుంచీ) ఆ డొంకలోనే బహిర్భూమికి వెళ్లేవారు. అయినా ఆ డొంకలో మానవ విసర్జితాల మీదుగా చింతగుంట గ్రామానికి నడిచివెళ్లిన నాయకుడు సుందరయ్యే. మరో నాయకుడు ఆ గ్రామానికి ఇలా నడిచివెళ్లిన చరిత్ర లేదని ఇప్పటికీ చిక్కవరం గ్రామస్తులు చెబుతుంటారు.

గ్రామాలకు వెళ్లాక సుందరయ్య మొదటగా గ్రామసభ ఏర్పాటు చేసేవారు. అక్కడకు చేరిన వారిని రాజకీయాలతో నిమిత్తం లేకుండా అందరినీ పలుకరించేవారు. సమస్యలడిగి డైరీలో నోట్ చేసుకునేవారు. సభ ముగిసే ముందు సమస్యల జాబితా అందరికీ చదివి వినిపించేవారు. తర్వాత ఏ సమస్యకు ముందు ప్రాధాన్యత ఇవ్వాలీ, ఏ పని తర్వాత చేయాలీ అనేవి చెప్పేవారు. ఆయన ఏగ్రామానికి వెళ్లినా ప్రప్రథమంగా తాగునీటి సమస్యకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆ తర్వాత రోడ్డు, పాఠశాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చేవారు.

ఓ ప్రాధాన్యత ప్రకారమే ఆయన అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేవారు. అంతిమంగా ఆయన ఒక నియోజకవర్గానికి ప్రతినిధి అయినా.. రాష్ట్రానికి ప్రతిపక్ష నేత కనుక యావత్ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు పెద్ద పీట వేశారు. తాను గెలిచిన నియోజకవర్గానికీ, రాష్ట్రానికీ, దేశానికీ గర్వకారణంగా నిలిచారు.

కార్మిక చట్టాలకు బిజెపి తూట్లు



ప్రజాశక్తి – కలెక్టరేట్: యజమానుల నిరంకుశ, బానిస సంకెళ్ళకు వ్యతిరేకంగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కింది. 4 లేబర్ కోడ్స్ గా మార్చింది. కార్మికుల హక్కులకు విఘాతం కలిగిస్తోంది. ఈ చర్యకు వ్యతిరేకంగా కార్మిక పోరాడాలి. మే డే సందర్భంగా దీనిపై ప్రతిజ్ఞ చేయాలి. కార్మికుల హక్కులు ప్రయోజనాలు సదుపాయాల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలి.

ఉప్పిలి రామకృష్ణ
టిఎన్‌టియుసి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ





ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం

ప్రజాశక్తి – కలెక్టరేట్ మే డే స్ఫూర్తితో ప్రభుత్వంగాన్ని రక్షించుకోవాలి. దేశంలో నూతన ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలు, కార్మిక వర్గంపై దాడి ప్రారంభించాయి. విదేశీ కార్పొరేట్ కంపెనీల వ్యాపారాలకు వీలుగా దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.



8 గంటల పని దినాన్ని, కార్మిక చట్టాలను మార్చి వేసి కార్మికులను రోడ్డున పడేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.మే డే స్ఫూర్తితో సాధించుకున్న 8 గంటల పని దినాన్ని, కార్మిక హక్కులను రక్షించు కోవడానికి ఐక్య పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలి.ఇందుకు కార్మికులు అంతా ఐక్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జి.వామనుమూర్తి
ఎఐటియుసి జిల్లా కార్యదర్శి















పోరాటాలకు దిక్సూచీ మేడే



మేడే కార్మిక హక్కుల దినోత్సవం. 'పోరాటాల్లో నుంచి పుట్టింది, పోరాటాలకు దిక్సూచీ అయింది. నేడూ పోరాటాలకు పిలుపునిచ్చేది' మేడే. ఆనాడు 8 గంటల పని దినం, పనికి తగ్గ వేతనం, సెలవులు, ఓటు హక్కు, సమాన పనికి సమాన వేతనం (మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లకు వేతనాలు) కావాలని జరిగిన పోరాటంలోనుంచి మేడే ఉదయించింది. మరి నేటికీ ఆ డిమాండ్లు పూర్తిగా అమలుకాని పరిస్థితి ఉంది. ప్రయివేటు రంగంలో 12 గంటలు పనిచేయించు కుంటున్నారు. వారానికి ఒక రోజు కూడా సెలవు లేని కార్మికులు ఉన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలుకాని ఫ్యాక్టరీలు, బిల్డింగ్ రంగం నేటికీ ఉన్నాయి. సమాన పనికి సమాన వేతనం అడిగితే మహిళలు ఉద్యోగం, పని కోల్పోవలసిందే. 99 శాతం శ్రామిక మహిళలకు పనికి తగ్గ వేతనం అమలు కావడంలేదు. కార్మికుల బాగోగులను ప్రభుత్వాలు పట్టించుకోవడం మానేశాయి. పెట్టుబడిదారుల దోపిడీకి కార్మికులను వదిలేశారు. యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘిస్తున్నా చూస్తూ ఊరుకుంటున్నాయి. కార్మికులకు అన్యాయం జరిగితే యూనియన్ తప్ప మరో మార్గం లేకుండా చేస్తున్నాయి. లేబర్ ఆఫీసు పేరుకే, నిజానికి అది యజమానుల ఆఫీసుగా మారింది. పైగా ప్రభుత్వమే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల పేరుతో కార్మికులు, ఉద్యోగుల శ్రమను దోచుకుంటోంది. 'ఒకే పని చేస్తున్న వారికి ఒకే వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం చెల్లించాలని' సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా అమలు చేయడంలేదు. అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ అమలుచేయాలని సుప్రీంకోర్టు తీర్పును కూడా పట్టించుకోవడంలేదు.

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం చెల్లిస్తోంది. ఈ రూ.3 వేలు నుంచే రూ.1,200 పెట్టి గ్యాస్ విడిపించాలని చెబుతోంది. ఇంతకన్నా అన్యాయం దోపిడీ, వెట్టిచాకిరీని మనం చూడగలమా?. కార్మికుల వేతనాలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని పోరాడుతుంటే కనీసం పట్టించుకోవడం లేదు. పైగా కేసు పెడుతోంది.

పేద మహిళలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్పించి, వారికి సురక్షితంగా కాన్పు జరిగేటట్లు చూసే ఆశ వర్కర్లకు ప్రసూతి సెలవులు లేవు. అసలు ఏ సెలవులూ లేవు.

మెప్మా ఆర్‌పిలు, సెర్ప్ విఒఎలకు ఇచ్చే జీతం వారి వ్యక్తిగత అకౌంట్‌లోకి వెయ్యరు. కనీసమైనా గుర్తింపు లేదు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, ఆర్‌పి, విఒఎలను కార్మికులను గుర్తించడంలేదు. కనీస వేతనం అమలు చేయడంలేదు. పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్, ప్రమాద బీమా సౌకర్యం లేదు. ఓపిక ఉన్నంతకాలం తక్కువ జీతానికి పనిచేయడం, 60 సంవత్సరాలు దాటిన తర్వాత ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లడం జరుగుతోంది. ఇంతకన్నా బానిసత్వం మరొకటి ఉండదు. వీరికి కనీసం వేతనం కూడా లేదు. ఇప్పటికీ గౌరవవేతనం లేదా పారితోషికం మాత్రమే చెల్లిస్తున్నారు. ప్రభుత్వమే స్కీమ్స్ పేరిట మహిళల శ్రమను ఇంత దారుణంగా దోచుకుంటుంటే, ప్రయివేటు యాజమాన్యాలు ఇంకా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయి. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు సవరించి నేటికి 20 సంవత్సరాలు కావస్తోంది. అయినా ప్రభుత్వాలకు చీమకుట్టినట్లు కూడా లేదు. దీనివల్ల లక్షలాది మంది మహిళలకు, కార్మికులకు వేల కోట్ల రూపాయలు వేతనంగా అందకుండా పోయాయి. ఈ కాలంలో నాలుగు ప్రభుత్వాలు, ఆరుగురు ముఖ్యమంత్రులు పరిపాలన చేశారు. పూర్తిగా యజమానుల పక్షాన నిలిచారు. నేటికీ కనీస వేతనాలు సలహా బోర్డు ఏర్పాటుకాలేదు.

ఇక లైంగిక వేధింపుల గురించి ఎంత తక్కువ చరించుకుంటే అంత మంచిదనిపిస్తోంది. పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉంది. దాని ప్రకారం అంతర్గత కమిటీలు వేయాలి. అసంఘటిత రంగం కోసం కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా స్థాయి కమిటీ వేయాలి. ప్రతి ప్రయివేటు సెక్టార్‌లో కమిటీలు వేయాలి. ఈ కమిటీలు వేయడం, అవి పనిచేయడం నామమాత్రంగానే ఉంది. ఒక వేళ ఎవరైనా ఉద్యోగిని ధైర్యంగా ఫిర్యాదు చేస్తే ఆమె ఉద్యోగం వదులుకోవాల్సిందే. విచారణ పేరుతో, లేబర్ డిపార్ట్‌మెంట్ పేరుతో, కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేస్తారు. న్యాయం మాత్రం జరగడంలేదు.

కొన్ని డిపార్ట్‌మెంట్లలో ముఖ్యంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ప్రతి నెలా జీతం ఇవ్వరు. ప్రతి నెలా మొదటి వారంలో జీతం చెల్లించాలన్న నిబంధన ఉన్నప్పటికీ జీతాలు మాత్రం చెల్లించరు. ఉదాహరణకు దిశ సఖీ వన్‌స్టాప్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగులకు గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదు. ఈ సెంటర్ ఉద్యోగులు చేసే సేవలు విలువకట్టలేనివి. అత్యాచార బాధితులకు షెల్టర్ ఇస్తారు. గృహ హింస కేసులు, లైంగిక వేధింపుల కేసులు, అత్యాచార కేసులు, అనాధ మహిళలకు షెల్డర్, కౌన్సెలింగ్ ఇలా ఎన్నో సేవలు అందించేవారికి మాత్రం ప్రతి నెలా జీతం రాదు. ఇలా జీతాలు రాని డిపార్ట్‌మెంట్లు ఎన్నో ఉన్నాయి.

ఇలా అడుగడుగునా ప్రభుత్వం శ్రామిక మహిళల పట్ల నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తోంది. పోరాటం తప్ప మరో మార్గం లేని పరిస్థితిని సృష్టిస్తోంది. కార్మికవర్గం ఐక్యంగా పోరాడాలన్న నాటి నినాదం నేటికీ అక్షర సత్యం.

- పి.మణి, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా నాయకులు

క్షీణిస్తున్న వలస కార్మికుల హక్కులు



అత్యధిక మంది వలస కార్మికులు వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగాలలో కనిపిస్తారు. దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 10 శాతం వలస కార్మికుల శ్రమ నుంచే వస్తోంది. అయితే, వలస కార్మికులు ఎంతమంది వున్నారు ? వారు ఏ రంగంలో పని చేస్తున్నారు ? ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తున్నారు ? తెలుసుకునే వ్యవస్థ లేదు. పర్మినెంట్ వర్కర్ల కంటే ఏడు రెట్లు అధికంగా వలస కార్మికులు ఉన్నట్లు జాతీయ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. దుర్బలమైన, ప్రమాదకంమైన, ఎటువంటి భద్రతా లేని పరిస్థితులు ఈ రంగంలో నెలకొన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 45 కోట్లా 60 లక్షల మంది వలస కార్మికులు ఉన్నారు. వీరిలో 41 శాతం మంది తమంతట తాముగా వలస కార్మికులుగా మారలేదు. తమ ప్రాంతాలలో నెలకొన్న నిరుద్యోగం వలస వెళ్ళాల్సిన పరిస్థితికి నెట్టింది.

వీరి జనాభా లెక్కలు సరిగా వుండవు. వాటి మీద ఆధారపడలేం. ఐక్యరాజ్యసమితిలో భాగంగా ఉన్న విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ 2013లో దేశంలో అంతర్గతంగా తిరిగే వలస కార్మికులు కోటిన్నర నుంచి 10 కోట్ల మంది ఉన్నట్లు అంచనా వేసింది. ఏరకంగా చూసినా భారతదేశంలో వలస కార్మికులు అసంఘటిత రంగంలో అత్యధికంగా ఉన్నట్లు తేలుతుంది. అందుకని వీరి పట్ల అధిక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ముఖ్యంగా పేదరికం, దుర్బలత, అభద్రత, ఉద్యోగంలో పెట్టుకునే పద్ధతికి...ఈ కార్మికుల సామాజిక స్థాయికి మధ్య ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలి. ఈ కారణంగా వీరు ప్రమాదకరమైన, అతి తక్కువ వేతనాలున్న పనులను చేయాల్సి వస్తోంది. కుల, లింగ వివక్షలను ఎదుర్కొంటున్నారు. కీలక రంగాలైన వ్యవసాయం, పరిశ్రమలు, నిర్మాణ రంగాల కార్యకలాపాలు వీరు లేనిదే నడవవు. కానీ వీరి కనీస భద్రత, న్యాయమైన వేతనాలను పట్టించుకునే దిక్కులేదు. వలస కార్మికులకు వర్తించే ప్రస్తుత చట్టాలు లేబర్ కోడ్లలో భాగం కానున్నాయి. లేబర్ కోడ్‌లు అమలులోకి వచ్చే లోపు 'అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979, భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల (పని మరియు సర్వీసు కండిషన్ల క్రమబద్ధీకరణ) చట్టం-1996, అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం-2008 అమలులో వుంటాయి.

కోవిడ్ సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న విషాదకర పరిస్థితులను, ఆరోగ్య-సామాజిక భద్రతా వైఫల్యాలను గమనించిన అత్యున్నత న్యాయస్థానం తనంత తానుగా వీరి తరపున కేసు తీసుకొని అనేక నిర్ధారణలకు వచ్చింది. అయితే ఈలోగా వలస కార్మికుల చట్టం-1997ను ప్రభుత్వం రద్దు చేసినప్పటికీ, ప్రభుత్వానికి అనేక ఆదేశాలను, సిఫార్సులను పంపింది.

అత్యున్నత న్యాయస్థానం 2020 మే 28న, 2020 జూన్ 9న ఇచ్చిన తీర్పుల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాలను, లోపాలను ఎత్తిచూపింది. ఈ కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపర్చడానికి అనేక ఆదేశాలు ఇచ్చింది. కానీ ఇవి ప్రధానంగా వలస కార్మికులకు ఉన్న పథకాలు, విధానాలకు పరిమితమైనవి. స్వస్థలాలకు తిరిగి వెళ్ళిన కార్మికుల సంఖ్యను గుర్తించమన్నది. 2020, జులై 31న ఇచ్చిన ఆదేశాలలో మాత్రం పైన పేర్కొన్న కార్మిక చట్టాల అమలు వివరాలను కూడా అన్ని ప్రభుత్వాలు తనకు సమర్పించమని చెప్పింది.

కేంద్ర ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించిన సందర్భాలలో రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మికులకు ఉపశమనం కలిగించాయి. తమ ఖర్చుతో రైళ్ళు, బస్సులను నడిపించాయి. తాను ఇచ్చిన ఆదేశాల అనంతరం...రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సమర్పించిన సమాచారంలో...వాస్తవాలను, గణాంకాలను పేర్కొనలేదని సుప్రీంకోర్టు గుర్తించింది. అందుకని చట్టాల అమలులో భాగంగా వలస కార్మికులను పెట్టుకునే సంస్థలను రిజిస్టర్ చేయాలని, లైసెన్సులను జారీ చేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది.

'వలస కార్మికుల కష్టాలు-సమస్యలు' లో భాగంగా అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్ స్థితిపై ప్రమాణ పత్రాన్ని దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు 2021 మే 24న ఆదేశించింది. అంతకు ముందు కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరుపై సుప్రీంకోర్టు సంతృప్తి చెందకపోవటంతో ఈ ఆదేశాలు ఇచ్చింది. దీనితో కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి పరిస్థితుల్లో 2021 ఆగస్టు 26న రూ.704 కోట్ల ఖర్చుతో వలస కార్మికులతో సహా అసంఘటిత కార్మికుల రిజిస్ట్రేషన్‌కు 'ఈ-శ్రమ' వ్యవస్థను ప్రవేశపెట్టింది. 2021 డిసెంబర్ ఆఖరులోగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికులు/వలస కార్మికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది.

'ఈ-శ్రమ' రిజిస్ట్రేషన్‌కు కార్మికుల నుండి స్పందన చాలా పరిమితంగా వుంది. అందులో వారికి ఎలాంటి ప్రయోజనం కనపడకపోవడం అందుకు కారణం. పైగా 'ఈ-శ్రమ' నెట్ సౌకర్యంతో కూడుకున్నది కావడంతో కార్మికులు దీనిలో తమంత తాముగా రిజిస్ట్రేషన్ చేసుకోలేరు. ఇప్పటికే నిర్మాణ (సెస్సు-సంక్షేమ పథకాలు), వ్యవసాయ రంగాలలో (రైతు బంధు పథకం) పరిమితమైన ఇతర పథకాలు ఉన్నాయి. 140 రకాల వృత్తులలో కార్మికులు పనిచేస్తున్నట్లుగా గుర్తించామని మోడీ ప్రభుత్వం చెప్పింది. కానీ తాము ఏ రకమైన సామాజిక భద్రతను ప్రవేశపెట్టేదీ ఇంత వరకు నిర్ణయించలేదు. 'ఈ-శ్రమ' లో రిజిస్ట్రేషన్‌కు ఇపిఎఫ్, ఇఎస్ఐ ఉన్న వారు అర్హులు కారు. సంఘటిత రంగంలో పని చేసే లక్షలాది మంది కాంట్రాక్టు వర్కర్లు, చిన్న మధ్యతరహా సంస్థల్లో పని చేసే కార్మికులకు ఈ రెండూ ఇప్పటికే ఉంటాయి. కాబట్టి వారు రిజిస్ట్రేషన్ చేసుకోలేరు.

వలస కార్మికులకు సామాజిక భద్రతను కల్పించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయకుండా 'వలస కార్మికుల చట్టం-1979' రద్దును ప్రకటించింది. దీనికి బదులుగా వచ్చేటటువంటి కోడ్ కాంట్రాక్ట్ కార్మికుల కష్టాలను పెంచుతుంది. 1979 చట్టం యజమానులకు, కాంట్రాక్టర్లకు, సబ్ కాంట్రాక్టర్లకు నిర్దేశిత ఆదేశాలు ఇచ్చింది. కాంట్రాక్టు కార్మికులను పెట్టుకోవాలంటే ముందుగా వీరు రిజిస్టరై ఉండాలి. ప్రతి వలస కార్మికుని సమాచారాన్ని, వారికి చెల్లించే వేతనాల వివరాల నమోదును స్పష్టీకరించింది. ఇవన్నీ ఇప్పుడు కోడ్‌లో లేవు. ఇటీవల అగ్ని ప్రమాదాలలో కార్మికులు చనిపోయినప్పుడు వారి గుర్తింపునకు వ్యక్తిగత రికార్డులు లేకపోవటం ప్రస్తుత పరిస్థితులకు అద్దం పడుతుంది. వారు పలానా వారు అని గుర్తించటానికి వంశీకుల డిఎన్ఎలను పరీక్షించాల్సి వచ్చింది. యజమానులు తమ దగ్గర ఉన్న వలస కార్మికుల నియామకం, నమోదు, రవాణా, నివాసం, కనీస వేతనం, కాలనుగుణ వేతనాలు తదితర సమాచారాన్ని తప్పకుండా నిర్వహించాలని 1979 చట్టం నిర్దేశించింది. వేతనాల చెల్లింపు, ఆరోగ్య సౌకర్యాల కల్పన, పని ప్రదేశంలో రక్షణ కల్పించే డ్రస్సులు, మంచినీటి సౌకర్యం, క్యాంటిన్, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల ఏర్పాటు, ప్రయాణ ఖర్చులను గ్యారంటీ చెయ్యటానికి-అయ్యే మొత్తం ఖర్చులో 40 శాతాన్ని సెక్యూరిటీ డిపాజిట్‌గా లైసెన్సింగ్ అధికారి తీసుకుంటారు. కాంట్రాక్టర్లుగానీ, ముఖ్య యజమానిగానీ వేతనాలు చెల్లించకపోతే ఈ నిధి నుండి చెల్లిస్తారు. ఈ హామీలను లేబర్ కోడ్‌లో ఉపసంహరించారు. 1979 చట్టంలో ఇంకొక ముఖ్యమైన నిబంధన ప్రకారం వలస కార్మికులు పారిశ్రామిక వివాదాల పరిష్కార యంత్రాంగాన్ని...తాము పనిచేసే ప్రాంతాలు, స్వస్థలాలు రెంటిలోనూ వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ విధంగా వలస కార్మికులకు వర్తించే ఇటువంటి 4 చట్టాలను కూడా కోడ్ ఒక్క కలం పోటుతో స్వాహా చేసింది.

వీధి వ్యాపారులతో సహా అందరికీ సామాజిక భద్రత కల్పించబడుతుందని కేంద్ర కార్మిక మంత్రి ప్రకటించారు. ఇంత వరకు దానికి సంబంధించిన ఎటువంటి పథకమూ తయారు కాలేదు. కానీ వలస కార్మికుల రిజిస్ట్రేషన్ పరిమితి 5 నెలల నుండి 10 నెలల వరకు పొడిగించారు. రిజిస్ట్రేషన్ వల్ల వలస కార్మికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదు. పెద్ద సంఖ్యలో వలస కార్మికుల హక్కులు నిరాకరించబడ్డాయి. అంతకు ముందున్న అనేక సౌకర్యాలను వలస కార్మికులు కోల్పోతారు.

- అమితవ్ గుహ, సిఐటియు జాతీయ కార్యదర్శి

దోపిడీకి గురవుతున్న గిగ్ వర్కర్లు



భారతదేశ సేవా ఆర్థిక వ్యవస్థను నడిపే ఇంజిన్ వంటి వారు గిగ్ వర్కర్లు. వీరు చేసే అనేక పనులలో మందులు, ఆహారం, కిరాణా సామాగ్రిని పంపిణీ చేయడం, మరమ్మతు పనులు చేయడం, చిన్న చిన్న పనులు నిర్వహించడం, నగర మంతా ప్రజలను డ్రైవ్ చేయడం వంటివి. మహమ్మారి సమయంలో వీరి సేవ, శ్రమ అత్యవసరమైంది. దీంతో జొమోటో, స్విగ్గి, ఉబర్, ఓలా, డూన్జో, జెప్టో, ర్యాపిడో, అర్బన్ కంపెనీ మొదలైన కంపెనీల సేవా వ్యాపారం ఆకాశాన్ని తాకాయి. మహమ్మారి సమయంలో నిరుద్యోగం పెరిగి, అధికారిక ఆదాయ వనరులు క్షీణించినందున మిలియన్ల మంది కార్మికులు ఈ కంపెనీలలో గిగ్ వర్కర్లుగా చేరారు. రాబోయే కొన్నేళ్లలో అధికారిక ఉద్యోగాలు వచ్చే అవకాశం లేనందున లక్షలాది మంది గిగ్ వర్కర్లగా చేరే అవకాశం ఉంది.

నిపుణుల అంచనా ప్రకారం ప్రస్తుతం భారతదేశంలో 77 లక్షల మంది కార్మికులు గిగ్ వర్కర్లుగా పని చేస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ నివేదిక ప్రకారం అంతర్జాతీయంగా 41శాతం వ్యాపారాలు ప్రత్యేక పనుల కోసం పూర్తి సమయం స్థానంలో కాంట్రాక్టు కార్మికులను నియమించుకోవడానికి మారాలని యోచిస్తున్నాయి.

2029–30 నాటికి గిగ్ వర్క్‌ఫోర్స్ 2.35 కోట్ల మంది కార్మికులకు విస్తరిస్తుందని భావిస్తున్నట్లుగా జూలై 2022 నీతి అయోగ్ నివేదిక పేర్కొన్నది. నేడు అతిపెద్ద కంపెనీలు ఏవంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి), సమకాలీన పెట్టుబడిదారీ విధానం డైనమిక్స్ అర్థం చేసుకోవాలంటే కొత్త డిజిటల్ టెక్నాలజీల అవసరం తప్పనిసరి అని తెలుస్తోంది. 2021 సంవత్సరంలో మొదటి ఐదు టెక్నాలజీ కంపెనీలు మొత్తం వి 588 బిలియన్ డాలర్ల విలువైన టెక్ నిల్వలను కలిగి వున్నాయి. అవి వి 191 బిలియన్ డాలర్ల ఆపిల్ నుంచి వి 56 బిలియన్ డాలర్ల విలువగల పేస్‌బుక్ వరకూ. డేటా ఆర్థికీకరణ, ఆర్థిక వ్యవస్థ కలిసి ఉద్యోగ ప్రపంచాన్ని మార్చి వేసాయి.

ఈ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో అభివృద్ధి చెందుతున్న గుత్తాధిపతులు. ఒకరి పై ఒకరు ఆధారపడే (ఒలిగోపోలిస్టులు) తమ మనుగడ కోసం వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులపై ఆధారపడి, లాభాల కోసం కేవలం వారి ఆర్థిక మూలధనాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారు. ఈ సాధారణ రక్త మార్పిడి లేకుండా చాలా కంపెనీలు లాభదాయకంగా వుండవు.

ఉదాహరణకు డ్రైవర్‌లు అందరూ ఒకేచోట లభించే ప్లాట్ ఫారం రూపొందించిన ఉబర్, తమ ఐపిఓలో తమకు మధ్య ఒప్పందంలో లాభాలు లేక పోవచ్చని పేర్కొంది. ఫలితంగా తమ ఆధిపత్యం కోసం ఫ్లాట్ ఫారం కంపెనీ లైన ఓలా, ఊబర్ కంపెనీ, స్విగ్గీ, జొమాటో, జెప్టో, ర్యాపిడో, డూన్జో మార్కెట్ లోకి వస్తున్న ఇతర కంపెనీలు దోపిడీ పద్ధతులు అనుసరిస్తారు. వీటినే నియో–రెంటియరిజం అంటారు. మార్కెట్ స్థాయిలో ఇది తీవ్ర రూపం దాల్చి పోటీ లేకుండా చేసే పద్ధతులు కంపెనీలు అనుసరించేలా చేస్తుంది. మార్కెట్ షేర్ పెంచుకోవడానికి ఎంత ధరకైనా పోటీ కంపెనీలు కొనడం లాంటివి. సాంకేతిక స్థాయిలో డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఆధీనంతో సామూహిక డేటా, దానితో వచ్చే రెవెన్యూ పై నియంత్రణ చేయగలరు. ఈ కోణంలో ఓలా, ఊబర్ కంపెనీలు రవాణా సంస్థలు కావు. వారి యాప్‌లోని కార్లు వారివి కావు. డ్రైవర్‌లు వారి ఉద్యోగులు కారు. వీరికి గిగ్ వర్కర్లు అని పేరు పెట్టి దోపిడీకి గురి చేస్తున్నారు.

ఉబర్ ముఖ్య ఆస్తి డేటా రూపంలో రవాణా లాజిస్టిక్స్ మేధస్సు. డిజిటల్ ప్లాట్ ఫారం యాప్‌పై నియంత్రణతో తన డేటా పై పట్టు బిగించి పెద్ద భూస్వాములుగా తన వర్కర్లు నుంచి కమిషన్ పేరుతో తగినరెంటును తీసుకుంటుంది. ఇదీ గిగ్ ఎకానమీ మోడల్. ప్రపంచీకరణ నయా ఉదారవాద ప్రక్రియ తీవ్రతను మనం చూస్తున్నాం. అనుబంధ సంస్థలు, అవుట్సోర్సింగ్‌తో ఉత్పత్తిని వికేంద్రీకరణ చేస్తున్నారు. తద్వారా లేబర్ నిర్వహణ, నియంత్రణ ప్రక్రియలకు గుర్తింపు తగ్గేలా చేసారు. కొంచెం కొంచెంగా డిజిటల్ ప్లాట్ ఫారమ్ కంపెనీలు అనధికార, ఆర్గనైజింగ్, రెగ్యులేటింగ్ పనిని నిర్వచించే విధానాలు తదితరమైన వాటిని అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. పని చేసేందుకు ఖర్చులు, ఎదురయ్యే ప్రమాదాలు వర్కర్లు భరించాలి. వారు తమ సొంత వాహనాలు, ఫోన్, షూస్ వాడుకోవాలి.

భారతదేశంలో ఐటి పరిశ్రమ వృద్ధి, 'సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ 'యుగంతో ప్రారంభమైంది. తనిఖీలు లేని సాంకేతిక పరిశ్రమ పెరుగుదల, దానిని అనుసరించిన వర్కర్ల దోపిడీ ప్రపంచ వ్యాప్తంగా జరిగింది. ఇదే ఈ పరిశ్రమలోని యజమానులు ఈ ఆధునిక యుగంలో అతిపెద్ద పెట్టుబడిదారులుగా మారడానికి సహాయ పడింది. భారీ లాభాలు, ఆటో మేషనుతో సాంకేతికత రంగం పెరిగిన వేగంతో నిరుద్యోగం మరింతగా పెరిగింది. ఎందుకంటే పరిశ్రమలో వర్కర్ల నైపుణ్యం మెరుగు పరచుకొనే అవకాశం ఇవ్వకుండా తొలగించడంతో ఈ పరిస్థితులు ఈ రంగంలోని యజమానులు ఆకర్షణీయంగా పనులు చేసే విధానం సష్టించటానికి కారణమైనాయి. అదే గిగ్ వర్క్.

గిగ్ వర్క్ ద్వారా స్వయం ఉపాధితో చిన్న వ్యాపార వేత్త అయ్యే అవకాశం, వారి పని పై ఇతరుల నిబంధనలు ఉండవని, తమ తమ సామర్థ్యం, ఆశలకు అనుగుణంగా వారు ఉద్యోగం చేసుకోగలరని, వివిధ డిజిటల్ యాప్‌లపై పీస్ రేటు వర్క్ ద్వారా మెరుగైన ఆదాయం పొందే అవకాశం వుంటుందనే ఒక అసత్య స్వప్నం తో గిగ్ వర్క్ మార్కెటింగ్ చేసారు.

మొదట్లో గిగ్ వర్క్‌కు ప్రోత్సాహకంగా కంపెనీలు కొత్త ఉద్యోగులకు మంచి జీతాలు ఇచ్చాయి. ఉదాహరణకు ఊబర్ కంపెనీ2014 లో ఇండియాకు 1 బిలియన్ యుఎస్ డాలర్ల మదుపుతో వచ్చి ఆ మొత్తాన్ని గిగ్ వర్కర్స్ మరియు వినియోగదారుల మార్కెట్ సృష్టించడానికి ఉపయోగించింది. ప్రభుత్వాలు కూడా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే పేరు మీద సంతోషంగా అలాంటి కంపెనీలు అభివృద్ధి చెందేందుకు అనుమతించాయి. వాస్తవానికి మన సమాజం నిరుద్యోగం,



ద్రవ్యోల్బణంతో కొట్టుమిట్టాడుతోంది. సరైన ఉపాధి అవకాశాలు లేక చాలా మంది ప్రజలు కూడా దీనిని అంగీకరించారు. మొదట్లో ఫ్లెక్సిబిలిటీ కారణంగా గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు కూడా గిగ్‌ని ఎంచుకున్నారు. సాధారణమైన శాశ్వత ఉద్యోగ విధానం కాకుండా ఫ్లెక్సిబిలిటీ వలన ప్రత్యామ్నాయ పనికి ఆకర్షితులయ్యారు. ఈ ప్రత్యామ్నాయ విధానం కార్మిక సంక్షేమం కానీ ఏ విధమైన కాంట్రాక్టు కానీ లేకుండా తయారు అయింది. ఇది ఐటి ఉద్యోగాల విధానానికి కొనసాగింపు. ఉద్యోగులు ఈ స్వాతంత్ర్యాన్ని ఇష్టపడ్డారు.

ఇది కార్మికులు చట్టాల ప్రకారం ఎలాంటి ఓవర్ టైమ్ వేతనం లేకుండా ఎక్కువ గంటలు పని చేసేలా చేస్తూ యజమానులకు మరింత స్వేచ్ఛ కలుగ చేస్తుందని అర్థం చేసుకుంటున్నారు. టెక్ వర్కర్ల లా మోసపోవడం గాక గిగ్ వర్కర్లు మరింత ప్రమాదంలో వున్నారు.

పారిశ్రామిక విప్లవం ప్రారంభంలో పెట్టుబడిదారులు పని నిర్ధారిత వేతనాన్ని దానికయ్యే సమయం బట్టి కాకుండా పని పూర్తి చేయటం ఆధారంగా మార్చటానికి ప్రయత్నం చేసింది. దీనితో ఉద్యోగి పీస్ రేటు పనికి సగటున మామూలుగా వేతనం తీసుకునే సమయంలో చేసే పని గంటలు లేదా



అంతకంటే ఎక్కువే చేయవలసి వస్తుంది. దీంతో వేతనంలో పెరుగుదల, పని విధానంలో ఫ్లెక్సిబిలిటీ మయం అవుతుంది.

విశాఖపట్నంలో స్విగ్గిలో 5షిఫ్ట్‌లుగా పెట్టారు. వాటిలో 3 షిఫ్టులు తప్పనిసరిగా చేయాలని కండీషన్ పెట్టారు. బలమైన కార్మిక ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా8 గంటల పని దినాన్ని డిమాండ్ చేసి సమయం ఆధారంగా వేతన నిర్ధారణ పారిశ్రామిక నియమం గా సాధించింది. ఈసారి టెక్నాలజీ ఇండస్ట్రీ యాజమాన్య వర్గం ఇది ఎగవేసే మార్గం కనిపెట్టింది.గిగ్ వర్కర్ల కు పీస్ రేటుకు వేతనం నిర్ణయించగలగటమే కాక(టెక్నాలజీ యాప్ ద్వారా) సంవత్సరాల తరబడి పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు వర్తించకుండా తప్పించగలిగింది.

ఆధునిక గిగ్ వర్కరు అన్ని వైపుల నుంచి దాడికి గురవుతున్నాడు. వర్కరు తన వనరులన్నింటిని పనిలో పెట్టుబడి పెడితే వారిని సంప్రదించకుండా సడన్‌గా వారి పీస్ రేటు వేతనంలో కోత పెడతారు. ఇన్‌సెంటివ్ తగ్గిస్తారు. వినియోగదారుల రేటింగ్ ఆధారంగా వారి పనితనం నిర్ణయిస్తారు. ఏకపక్ష రూల్సుతో పెనాల్టీలు వేసి వేతనంలో కోత పెడతారు. సెలవులు, ఉద్యోగ రక్షణ అనేవి వుండవు. యాప్‌లో వారిని బ్లాక్ చేస్తే ఉద్యోగం నుండి తొలగించి నట్లే. ఈ ఏకపక్ష మార్పులతో వారి మనుగడ కోసం తక్కువ వేతనంకు ఎక్కువగా కష్టపడవలసి వస్తుంది. అందుకే గత రెండు సంవత్సరాలలో గిగ్ వర్కర్లు తమను తాము వ్యవస్థీకరించు కునే ప్రయత్నం చూసాము. గత కొన్ని సంవత్సరాలుగా వారి పై పెరుగుతున్న దోపిడీ గురించి అందరి దృష్టికి తీసుకురావాలని జాతీయ అంతర్జాతీయ వార్తా మాధ్యమాలలో కవరేజీ అయ్యేలా డిజిటల్ యాప్ ఆధారిత ప్లాట్ ఫారమ్‌లో పని చేసే అసంఘటిత రంగ కార్మికులు, ఆహార రవాణా వర్కర్లు, డ్రైవర్‌లు, ఎలక్ట్రిషియన్‌లు, బ్యూటీషియన్లు, అనేక నగరాల్లో ఆకస్మిక సమ్మె చేపట్టారు.

ఐటి పరిశ్రమలో పెట్టుబడి దారులు సంపాదించిన ప్రాథమిక నిధులు 'డేటా'. దీనితో వర్కర్లను దోపిడీ చేసి వారిని మానిప్యులేటు చేసే అధికారం వచ్చింది. ఉదాహరణకు 2017 న డెలివరీ, కాబ్ డ్రైవింగ్ ఉద్యోగులకు రోడ్డుపై ప్రాణహానికి అవకాశం ఉన్నందున గిగ్ వర్కర్లకు సర్వీస్ ప్రొవైడర్లు ప్రమాద బీమా కల్పించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పు నిచ్చింది. చాలా కంపెనీలు ఈ బాధ్యతను ఎగవేశాయి. ప్రమాద బీమా ఇచ్చిన కంపెనీలు కూడా ఆ ప్రీమియంను గిగ్ వర్కర్ల వేతనం నుండి మినహాయించినదో లేక వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేసిందో చెప్పలేం. ఎందుకంటే ప్రాథమిక డేటా అంతా ప్రొవైడర్ కంపెనీ అధీనంలో వుంటుంది. ఉదాహరణకు కోవిడ్ సమయంలో ఊబర్ కంపెనీ తమ డ్రైవర్స్ సేఫ్టీ షీల్డ్స్ (బయోబబుల్ అంటారు) వాడటం (వేరొక సర్వీస్ ప్రొవైడర్ ద్వారా) తప్పనిసరి చేసింది. కంపెనీ దీని కయ్యే ఖర్చు తానే భరించానని చెప్పింది. వాస్తవానికి డ్రైవర్స్ పై, కష్టమర్ల పై అదనపు భారం వేసింది. అలా ఇన్ స్టలేషన్ ఖరీదు కూడా పూర్తిగా వసూలు చేసి వుండొచ్చు. వర్కర్ల పని వేళలు, సగటు ఆదాయం, మధ్యస్థ ఆదాయాలు, పనితీరు పై రేటింగ్ లు ఇలా అన్ని రకాల డేటా, కంపెనీల స్వంతం కనుక తమ కనుగుణంగా అల్గారిథమ్‌తో డేటాను తారుమారు చేయగలరు. వర్కర్లు తమ పోరాటంతో ఒక హక్కు సంపాదించుకున్నా, కంపెనీ వేరే నియమాలతో, మెకనిజమ్‌తో వారి ఆదాయాన్ని తగ్గించగలదు.

అందుకని వర్కర్లకు సామూహిక డేటా హక్కుల కోసం చేసే పోరాటం టెక్ వర్కర్లను గిగ్ వర్కర్లను కలుపుతుంది. ఈ ఆధునిక రోజుల్లో కంపెనీలు చేసే దోపిడీకి వ్యతిరేకంగా చేసే పోరాటానికి ఇది అవసరం. అందుకోలేని లక్ష్యాల్ని నిర్దేశించి మోసం చేసే కంపెనీలను ఎదుర్కోవటానికి ఇదే ప్రాథమిక పోరాటం. అసమంజసమైన లక్ష్యాలతో గిగ్, టెక్ వర్కర్లు ఇద్దరూ ప్రతీరోజూ ఎక్కువ పని గంటలు పని చేయవలసి వస్తోంది. దీనిని సవాలు చేస్తే కంపెనీలు సగటు ఆదాయ సమూహం డేటా కాకుండా అత్యధిక ఆదాయం పొందే సమూహం డేటా చూపిస్తాయి. ఇందువలన డేటా మనకు అందుబాటులో లేకుండా కంపెనీ నిర్ణయాలపై లీగల్ ఆడిట్ జరగకుండా కంపెనీలు చేసే దోపిడీని (వర్కర్ల గా వారిని సవాలు చేయటం కాదుకదా) నిరూపించలేము.

ఐటి రంగంలోని పెట్టుబడి వర్గం సంపాదించే లాభాలే ఒక వైపు టెక్నాలజీ కంపెనీ యజమానులను ప్రపంచంలోనే అత్యధిక సంపన్నులుగా తయారు చేస్తే ఆ రంగం లోని ఉద్యోగులు మాత్రం వారి హక్కులు స్వేచ్ఛ కోల్పోయి అత్యంత దోపిడీకి గురి అవుతున్నారు. దీనిని మార్చాలంటే వర్కర్లకు డేటాపై సమిష్టి హక్కు కోసం పోరాడాలి. ఈ మధ్య కాలంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను డెవలప్ చేసి ప్రజలకు, గిగ్ వర్కర్స్‌కు నమ్మకాన్ని కలిగిస్తున్నది. ఓలా, ఊబర్ ఇతర యాప్‌లు 40శాతం వరకు కమీషన్ తీసుకుంటుంటే కేరళ ప్రభుత్వం 8శాతం మాత్రమే కమీషన్ తీసుకొని ఆ సొమ్మును కార్మికుల సంక్షేమానికి ఉపయోగిస్తుంది. అదే రకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేరళ తరహాలో యాప్‌ను డెవలప్‌చేసి నిర్వహించడం ఒక ప్రత్యామ్నాయంగా ఉంటుంది.

బి.జగన్
కన్వీనర్,
ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్
విశాఖ జిల్లా



కార్మిక విజయానికి ప్రతీక.. మేడే

(4వ పేజీ తరువాయి..) నిర్వీర్యం చేస్తున్నారు. ప్రత్యేక ఆర్థిక మండళ్లలోకి కార్మికశాఖ అధికారులను అనుమతించడం లేదు. కార్మికుడికి కష్టం కలిగితే చెప్పుకునే దిక్కులేకుండా చేస్తున్నారు. సంఘాలను పెట్టుకుంటే విధుల్లోంచి తొలగిస్తున్నారు. ఇటువంటి కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆంధ్రాలో అరుణతార వెలసింది మేడే నాడే..

ఆంధ్రాలో అరుణతార వెలసింది మేడే నాడే. విప్లవానికి, దేశంలో కమ్యూనిస్టు నూతన చరితకు ఊపిరిలూదిన పోరు శిఖరం పుచ్చలపల్లి సుందరయ్య జననమూ విశ్వ కార్మికులు హక్కుల పండగ చేసుకుంటున్న మేడే నాడే. ఈ రెండూ కాకతాళీయమే అయినా చరిత్రకు ఒక నూతన అధ్యాయమైంది.

శ్రామికుల వెన్నుతట్టి వెన్నంటి నిలిచి హక్కుల కోసం విప్లవ నినాదం చేసిన పుచ్చలపల్లి సుందరయ్య అడుగులు పీడిత తాడిత, బడుగుల గుండెల్లో.. జాతి చరిత్రలో చిరస్మరణీయమైనవిగా నిలిచిపోయాయి. హక్కుల కోసం ఆయన సాగించిన పోరుబాటలో మిగిల్చిన అడుగు జాడలే నేటి పోరాటాలకు వెలుగు దివ్వెలుగా ఉన్నాయి.